నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 32 సోమవారం, అక్టోబర్ 27, 2025 , పేజీలు - 12 వెల : 2/-

### మంచిమాట

నీకున్నదంతా ఏదో ఒకరోజున ఇచ్చేయాల్సిందే. నీవెంట ఏదీ తీసుకెళ్ళలేవు. అంచేత ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇవ్వు. ఇచ్చే గొప్ప అవకాశాన్ని నువ్వే వాడుకో. ఇవ్వడంలోని ఆనందాన్ని అనుభవించాల్సింది నువ్వేకానీ నీ వారసులు కాదు.

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

## తెలంగాణ వీర యోధుడి గురించి యావత్ దేశానికి తెలియజేసిన ప్రధాని మోదీ



హైదరాబాద్ :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తోన్న రేడియో కార్యక్రమం మన్ కీ బాత్. ప్రతి నెలా చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు బ్రాడ్‌కాస్ట్ అయ్యే ప్రోగ్రామ్ ఇది. 2014లో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఆయన దీన్ని కొనసాగిస్తూ వస్తోన్నారు. ఆ ఏడాది అక్టోబర్ 3వ తేదీన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 45 నిమిషాల నుంచి గంట పాటు రేడియో ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు.

ఈ నెలలో ఇదే చివరి ఆదివారం కావడం వల్ల నేడు 127వ మన్ కీ బాత్ కార్యక్రమం టెలికాస్ట్ అయింది. ఇందులో తెలంగాణ వీర యోధుడు కొమరం భీమ్ గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఆయన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా భీమ్ గొప్పతనం, త్యాగం, పోరాటాల గురించి దేశ ప్రజలందరికీ వివరించినట్టయింది. 20వ శతాబ్దం తొలినాళ్లలో దేశంలో స్వాతంత్ర్య ఆశలు పూర్తిగా సన్నగిల్లిన సమయాన్ని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బ్రిటిషు పాలకులు దేశం అంతటా అణచివేతకు పాల్పడ్డారని, ప్రజలను విపరీతంగా దోచుకున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని దేశభక్తులకు ఆ కాలంలో అణచివేత మరింత భయంకరంగా ఉండేదని, బ్రిటీష్ పాలకులతో పాటు క్రూరత్వం నిండిన నిజాం పాలకుల అకృత్యాలను కూడా వారు భరించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాలు, గిరిజన ప్రజలపై అంతులేని అమానుష దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి కష్ట పరిస్థితుల్లో 20 సంవత్సరాల వయస్సున ఓ యువకుడు ఈ అణచివేతకు ఎదురుతిరిగారని, అన్యాయాన్ని ఎదిరించిన నిలిచారని ప్రధాని మోదీ చెప్పారు. నిజాం పాలకులు, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరే కంగా పోరాడటానికి ముందుకు వచ్చాడని గుర్తు చేశారు. ఈ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆ యువకుడు నిజాం అధికారిని సైతం హతమార్చాడని, అరెస్టు కాకుండా తప్పించుకోవడంలో విజయవం తమయ్యాడని మోదీ తెలిపారు. ఆ యువకుడే కొమరం భీమ్.. అని యావత్ దేశానికి పరిచయం చేశారు. అక్టోబర్ 22వ తేదీన ఆయన జయంతి జరుపుకొన్నామని చెప్పారు. కొమరం భీమ్.. ముఖ్యంగా గిరిజన సమాజంలోని లక్షలాది మంది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని ప్రధాని అన్నారు. వీలైనంత ఎక్కువ ఆయన గురించి తెలుసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు.

### జూబ్లీహిల్స్ లో వ్యూహం మార్చిన బీఆర్ఎస్
## తాజా సర్వేతో అలెర్ట్

హైదరాబాద్ :జూబ్లీహిల్స్ లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. పోలింగ్ సమయం సమీపించే వేళ కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. సర్వే నివేదికల ఆధారంగా పార్టీల నేతలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ కనిపిస్తోంది. ఎవరికి వారు గెలుపు పైన ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మంత్రులను రంగంలోకి దించుతోంది. బీఆర్ఎస్ తాజా నివేదిక ల ఆధారంగా వ్యూహం మార్చింది. కొత్త ప్రణాళికలతో ఓటర్ల వద్దకు వెళ్తోంది. దీంతో... గెలుపు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠగా మారుతోంది. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ - కాంగ్రెస్ మధ్య తాజా సర్వే నివేదికల మేరకు నువ్వా నేనా అన్నట్లుగా పోటీ సాగుతోంది. రెండు పార్టీల నుంచి కీలక నేతలు ప్రచారంలోకి దిగారు. కాం గ్రెస్ మంత్రులను ప్రతీ వార్డు బాధ్యతలు అప్పగించి.. గెలుపును ప్రతిష్ఠా త్మకంగా తీసుకుంది. ఈ సమయంలో మాజీ సీఎం కేసీఆర్ జూబ్లీహిల్స్ పైన చేయించిన సర్వేల ఆధారంగా ప్రచారం.. పోల్ మేనేజ్ మెంట్ పైన కీలక నేతలకు దిశా నిర్దేశం చేసారు. అందులో భాగంగా కేటీఆర్ - హరీష్ ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా తమ పదేళ్ల పాలనలో హైదరాబాద్ లో వచ్చిన మార్పు.. కాంగ్రెస్ పాలనలో జరిగిన నష్టం గురించి ఎక్కువగా వివరిస్తున్నారు. మైనార్టీ ఓట్ బ్యాంక్ ఇక్కడ గెలుపు ఓటముల్లో కీలకంగా మారటంతో.. ఆ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన పైనే ఎక్కువగా విమర్శ లు చేస్తూ.. తమ పాలనతో పోల్చి ఓటర్లకు అర్దమయ్యే విధంగా వివరిస్తున్నారు.



### బీఆర్ఎస్ ఏకపక్షంగా నన్ను బయటకు పంపింది..
## కవిత ఎమోషనల్



నిజామాబాద్, అక్టోబరు26: బీఆర్ఎస్ ఏకపక్షంగా తనను బయటకు పంపిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో అన్ని బాధ్యతలకు తాను రాజీనామా చేసి.. మళ్లీ జనం ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు. ఎవరి పనితీరు ఏమిటో రివ్యూ చేసుకుని ఉంటే మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయేది కాదని తెలిపారు. జనంబాటకు చాలామంది అండగా నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. జనంబాట చేపట్టిన తనపై ఓ ఎంపీ లేనిపోని ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు కవిత. ఇవాళ(ఆదివారం) నిజామాబాద్ జిల్లాలో రెండో రోజు కవిత జనంబాట కొనసాగుతోంది. మోపాల్ మండలం బైరాపూర్ గ్రామంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. ఆ ఎంపీ చిట్టా బయట పెడతా..ఎంపీ అర్వింద్ రాజీనామా చేస్తే బీసీ బిల్లు అదే వస్తుందని చెప్పుకొచ్చారు. అతని చిట్టా త్వరలోనే బయట పెడతానని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను అణచి వేస్తోందని ఫైర్ అయ్యారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ కోసం జనంబాట పట్టానని ఉద్ఘాటించారు. ప్రతీ జిల్లాలో చాలా కార్యక్రమాలు చేపడతానని వివరించారు. మునిగిపోయే పడవ కాంగ్రెస్‌తో తనకేం ఏం పని అని కవిత ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లాలోని యంచ గ్రామంలో ముంపు ప్రాంతాలను చూశామని చెప్పుకొచ్చారు కవిత. రైతులు దగా పడ్డారు..అన్నదాతలకి ఎకరానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 70 వేల ఎకరాల్లో మొక్కజొన్న రైతులు దగా పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 శాతం మంది రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకున్నాక కొనుగోలు కేంద్రాలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ మరోసారి ఆలోచించాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అన్నదాతలు ఒక్కో క్వింటాకు రూ.700 నష్టపోయారని వాపోయారు. ధాన్యం తడిసి చెడిపోయిందని తెలిపారు కవిత.బీజేపీ ఎంపీ ఉన్నా లేనట్లే...రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొక్కజొన్న, వరికి వెంటనే బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అసమర్థ కాంగ్రెస్ సర్కారు పాలనలో..
### తెలంగాణ దీనస్థితికి అద్దం పట్టే రెండు ఫొటోలివి



హైదరాబాద్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పరిపాలనను గాలికి వదిలేసి ప్రజల ప్రాణాలతో రేవంత్ సర్కార్ చెలగాటం ఆడుతుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. అసమర్థ కాంగ్రెస్ సర్కార్ పాలనలో తెలంగాణ దీనస్థితికి అద్దం పట్టే ఫొటోలు ఈ రెండు అని కేటీఆర్ పేర్కొన్నారు.

సర్కారు దవాఖానాలో సరిపోను ఆక్సిజన్ సిలిండర్లు లేక ఇద్దరు చిన్నారులకు ఒకటే సిలిండర్ పెట్టిన దుస్థితి వరంగల్ ఎంజీఎంలో. కొనుగోలు కేంద్రాల్లో విపరీత జాప్యం చేస్తూ, ధాన్యం వర్షానికి తడుస్తున్నా సర్కారు కొనకపోవడంతో కామారెడ్డి జిల్లాలో అధికారుల కాళ్ల మీద పడ్డ రైతన్న చిత్రం ఇది అని కేటీఆర్ పేర్కొన్నారు.పాలన పడకేసి ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే కాంగ్రెస్ పాలకులేమో కప్పం కట్టడానికి ఢిల్లీ బాటపట్టారు అని కేటీఆర్ విమర్శించారు.

## మొంథా తుపాన్..
### అధికార యంత్రాంగం అప్రమత్తం
: సీఎం చంద్రబాబు



అమరావతి, అక్టోబర్ 26: మొంథా తుపాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్ పై ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలతోపాటు ఉన్నతాధికారులందరూ అన్ని శాఖల సమన్వయంతో పనిచేసేలా సన్నద్ధం చేశామని చెప్పారు. జిల్లాలకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంచి.. ప్రత్యేక అధికారులను నియమించామని వివరించారు. విద్యుత్, తాగునీరు, రవాణా సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే వర్షం తీవ్రత, తుపాన్ ప్రభావానికి సంబంధించిన సమాచారాన్ని నేరుగా ప్రజలకు పంపడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు సీఎం చంద్రబాబు సూచించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి.. అక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ మేరకు ఎక్స్

### బీసీ ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చావా..
## రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు



హైదరాబాద్ :నేను కేటీఆర్.. కేసీఆర్‌తో మాట్లాడి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పైకి రావడానికి సంపూర్ణమైన బాధ్యత తీసుకుంటానని హరీశ్‌రావు తెలిపారు. ఆరోజు మీరు అడగకపోయినా హైదరా బాద్‌లో వడ్డెర సంఘానికి కేసీఆర్ ఎకరం భూమి ఇచ్చిందని గుర్తుచేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్‌లో వడ్డెర ఆత్మగౌరవ భవనానికి స్థలాలను కేటాయించిందని చెప్పారు. దాని నిర్మాణానికి డబ్బులు ఇచ్చిందని తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అంటే కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎక్కడా కొత్త స్కీమ్ పెట్టింది లేదు కొత్త భవనం కట్టింది లేదని విమర్శించారు. కేసీఆర్ కట్టిన ఫ్లైఓవర్లకు, బిల్డింగ్ లకు రిబ్బన్లు కట్ చేసుడు.. కేసీఆర్ పెట్టిన స్కీములను కటింగ్ చేసుడు చేస్తుందని అన్నారు. కేసీఆర్ కిట్టు, బతుకమ్మ చీర, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ అన్ని పథకాలకు కత్తెర పెట్టిండని మండిపడ్డారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవులకు, కురుమలకు ఆత్మగౌరవ భవనాలను హైదరాబాద్‌లో నిర్మించామని చెప్పారు. రేవంత్ రెడ్డి.. ఒక రూపాయి అయినా బీసీల ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు ఇచ్చావా అని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ ప్రారంభించిన బీసీ ఆత్మగౌరవ భవనాలకు నిధులు విడుదల చేసి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వడ్డెర సమాజం రాజకీయంగా, ఆర్థికంగా పైకొచ్చే విధంగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. వడ్డెర అంటే బండ జాతి, మొండి జాతి, మాట తప్పని జాతి అని హరీశ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీతమ్మ భర్తను కోల్పోయి చిన్నపిల్లలు ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. గోపీనాథ్ చనిపోతే ఆ కుటుంబాన్ని అనాథలుగా వదిలేయమంటారా అని ప్రశ్నించారు. భర్త చనిపోతే ఏడ్చిన ఆడపడుచుని కాంగ్రెస్ నాయకులు అవహేళన చేశారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరి ఓటు 11వ తారీఖు రోజు పోలింగ్ బూత్‌కు పోయి సునీతమ్మకు ఓటు వేయాలన్నారు. కారు మీద ఓటు గుద్దితే రేవంత్ రెడ్డి గువ్వ గుయ్యిమనాలన్నారు.

## ఏజెన్సీ బడుల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళనకరం
: వైఎస్ షర్మిల



అమరావతి : ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళనకరమని ఏపీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఈ మేరకు ట్విటర్‌లో చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్రే కారణమని ఆరోపించారు. కురుపాం ఘటన తర్వాతైనా ప్రభుత్వం నిద్రమత్తు వీడకపోవడం సిగ్గుచేటని, ముక్కు పచ్చలారని బిడ్డలను అన్యాయంగా పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు.మన్యం జిల్లా హడ్డుబంగి పాఠశాల విద్యార్థిని మృతి కూటమి ప్రభుత్వం చేసిన వరుస హత్యనేనని ఆరోపించారు. బిడ్డ బంగారు భవిష్యత్ ను చిదిమేశారని, గురుకులాల్లో పిల్లల జీవితాలను గాల్లో దీపాలుగా మార్చారని దుయ్యబట్టారు.

## పవన్ ను కలుస్తా, గుట్టు విప్పుతా వైసీపీ మాజీ నేత

గోదావరి :గోదావరి కేంద్రంగా రాజకీయం మారుతోంది. కీలక సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి పార్టీల్లో ఆసక్తికర లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. భీమవరం డీఎస్పీ జయసూర్య పైన విచారణ కోసం పవన్ ఫిర్యాదు చేయటం.. రఘురామ వ్యాఖ్యలు చర్చగా మారాయి. ఇప్పుడు ఈ వ్యవహారం పైన 2019 ఎన్నికల్లో పవన్ ను ఓడించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పందించారు. రఘురామ చెప్పింది నిజమని చెప్పకొచ్చారు. పవన్ ను కలుస్తానని... అసలు గుట్టు విప్పుతానని గ్రంధి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. 2019 ఎన్నికల్లో భీమవరంలో పవన్ ను ఓడించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేసారు. తాజాగా భీమవరంలో పేకాట నిర్వహణ.. డీఎస్పీ జయసూర్య పైన పవన్ ఫిర్యాదు అంశం.. దీని పైన డిప్యూటీ స్పీకర్ రఘురామ చేసిన కామెంట్స్ రాజకీయంగా కూటమి లో చర్చగా మారాయి. కాగా.. ఇప్పుడు స్పందించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి భీమవరంలో పేకాట వ్యవహారం పైన పవన్ కళ్యాణ్ స్పందించడం హర్షనీయమన్నారు. తాను పవన్ ను కలిసి అన్నీ చెప్పాలని ఉందని.. తనకు అప్పాయింట్ మెంట్ ఇస్తే అన్నీ బయట పెడతానని చెప్పకొచ్చారు. ఇక, భీమవరం లో జరుగుతున్న పలు అంశాలపై కూడా గ్రంధి స్పందించారు. భీమవరంలో 14 నెలలుగా క్లబ్ నుండి డబ్బు వసూలు చేస్తున్న వాళ్ళు, రెండు నెలలు గా ఆదాయం రాకపోవడంతో పోలీసు అధికారిని టార్గెట్ చేశారని చెప్పారు. ఆ పోలీస్ అధికారి మీద పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు చేయడం చాలా దారుణమని గ్రంధి వ్యాఖానించారు.



# నీతివంతమైన పాలనకు పట్టం కట్టండి

- మంత్రుల ఆశీస్సులతో మీ ముందుకొచ్చాము..
- ప్యానల్ కు పట్టం కట్టండి.. బ్యాంకు ను అభివృద్ధి బాటలో నడిపిస్తాం
- వెలిచాల రాజేందర్ రావు
- కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం, ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ప్యానల్ అభ్యర్థుల గెలుపు కోసం వెలిచాల రాజేందర్ రావు ప్రచారం..




కరీంనగర్ :నవంబర్ ఒకటో తేదీన జరిగే అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో నీతివంతంగా నిజాయితీగా సేవలందించే తమ ప్యానల్ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో మీ ముందుకు వచ్చామని అర్బన్ బ్యాంకు ఓటర్లు తమ ప్యానెల్ అభ్యర్థులకు పట్టం కట్టాలని కోరారు. అర్బన్ బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపిస్తామని రాజేందర్ రావ్ హామీ ఇచ్చారు. కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియం, ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఆదివారం ఉదయం అర్బన్ బ్యాంక్ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ వెలిచాల రాజేంద్రావు మార్నింగ్ నిర్వహించారు. రాజేంద్రావు వెంట ప్యానెల్ అభ్యర్థులు సైతం పాల్గొన్నారు. అర్బన్ బ్యాంకు ఓటర్లు. వాకర్స్..వివిధ వర్గాలకు చెందిన ప్రజలను ఆకట్టుకునే రీతిలో ప్రచార నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అర్బన్ బ్యాంకు ఓటర్లను ఆకట్టుకునే విధంగా ఆలోచింపజేసే విధంగా ఓటు వేసి గెలిపించాలని రాజేందర్ రావు కోరారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వాకర్సు..అర్బన్ బ్యాంకు ఓటర్సు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ప్యానెల్ కు మద్దతు ప్రకటించారు. రాజేందర్ రావు బలపరుస్తున్న ప్యానెల్ ను ఓట్లు వేసి గెలిపిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ నిజాయితీగా నీతిమంతమైన సేవాభావంతో పనిచేసేందుకు ముందుకొచ్చిన తమ ప్యానల్ అభ్యర్థులకు అర్బన్ బ్యాంకు ఓటర్లు.. వాకర్సు మద్దతు తెలిపాలని కోరారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సహకార వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులు తీసుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాజేందర్ రావ్ ఆధ్వర్యంలో ప్యానెల్ అభ్యర్థులంతా తప్పకుండా గెలిచి రావాలని వారు సూచించారని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు లో అవినీతి రహితంగా సేవలందించడమే తమ ప్యానెల్ అభ్యర్థుల లక్ష్యమని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకును పూర్తిగా సంస్కరిస్తామనీ, ఎలాంటి అవినీతి కి తావు లేకుండా సేవలందించేలా పాలకవర్గంతో పని చేయిస్తానని రాజేందర్ రావు హామీ ఇచ్చారు. గతంలో కొందరి వల్ల అవినీతి ఆరోపణలు వచ్చాయని బ్యాంకు పై ఎలాంటి మచ్చ లేకుండా చూసే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. తమ అభ్యర్థుల వ్యక్తిత్వము అనుభవము ఆశయం పనిచేసే తత్వము.. గుణగణాలను అన్నింటిని పరిశీలించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజేంద్రావు కోరారు. అర్బన్ బ్యాంకులో డిపాజిట్లను ఇప్పుడున్న దాని కంటే మూడింతలు పెరిగేలా ప్రత్యేక కృషి చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా బ్యాంకును పూర్తిగా డిజిటలైజేషన్ చేసి ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వెంట వెంటనే పనులు జరిగేలా చూస్తామన్నారు. డిపాజిట్ దారులకు పూర్తి రక్షణ ఉండేలాగా బాధ్యత యుతంగా పనిచేస్తామన్నారు. అలాగే కొత్తగా నాలుగు బ్రాంచ్ లను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో లాగా కాకుండా ఈసారి తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించి కొత్త పాలకవర్గానికి స్వాగతం పలకాలని రాజేందర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు,

అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిపల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆకుల ఉదయ్ అనంతుల రమేష్, పొన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ లో ప్రధాని మోదీ మన్ కి బాత్ వీక్షించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి





చర్య :- కరీంనగర్ : ప్రధానమంత్రి నరేంద్ర మోది మన్ కి బాత్ ప్రోగ్రామ్ సందర్భంగా హుజురాబాద్ పట్టణం లోని 36వ పోలింగ్ బూత్ బిజెపి అధ్యక్షురాలు తాళ్లపల్లి దేవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన మన్ కి బాత్ వీక్షణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ మన్ కి బాత్ 127 వ ఎపిసోడ్లో జిఎస్టి గురించి, స్వదేశీ వస్తువుల కొనుగోలు, ఛత్ పండుగ, తెలంగాణ పోరాట యోధులు కొమరం భీమ్ , సర్దార్ వల్లభాయ్ పటేల్, గార్బేజ్ కేఫ్ , వందేమాతరం 150 వ వార్షికోత్సవ అంశాలపై ప్రధానంగా మాట్లాడారని తెలిపారు. ముఖ్యంగా జీఎస్టీ స్లాబ్ మార్పుల వల్ల ఈసారి పండుగ సీజన్లో అన్ని వర్గాలకు సంతోషాన్నిచ్చాయన్నారు. గతంలో ఏ పుడు లేనివిధంగా దేశవ్యాప్తంగా దీపావళి పండుగ సందర్భంగా లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం జీఎస్టీ నీ సులభతరం చేయడంతోనే ఇది సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ బిజెపి సీనియర్ నాయకులు తిప్ప బత్తిని రాజు కొలిపాక వెంకటేష్ తాళ్ళ పల్లి దేవేంద్ర మునిగంటి నాగరాజు జంపాల సువర్ణ తాళ్లపల్లి హరీష్ గుర్రం సంతోష్ తూర్పాటి రాజశేఖర్ మల్లెల సరిత తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులందరం కలిసికట్టుగా ప్యానల్ ఏర్పాటు చేసుకున్నాం

- ప్యానల్ కు కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ మద్దతు ఇస్తున్నారు..
- అందరం కలిసి విజ్ఞప్తి చేయగా రాజేందర్ రావు బలపరిచారు..
- మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, విప్ ఆది శ్రీనివాస్ ఆశీర్వదించారు..
- కచ్చితంగా మా ప్యానెల్ గెలుస్తుంది..
- కలిసికట్టుగా కృషి చేస్తున్నాం..
- నేను చైర్మన్ రేస్ లో లేను..
- కట్టు కథలు నమ్మవద్దు..







చర్య :- కరీంనగర్ :డైరెక్టర్లుగా గెలిచిన తర్వాత మంత్రులు, వెలిచాల రాజేందర్ రావు, కాంగ్రెస్ పెద్దలు చైర్మన్ ను ఎంపిక చేస్తారు..కాంగ్రెస్ నాయకుడు, అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థి మూల వెంకట రవీందర్ రెడ్డి..అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో నిజాయితీగా నీతిమంతంగా సేవలందించేందుకు అభ్యర్థుల అందరం కలిసి కలిసికట్టుగా ప్యానల్ ను ఏర్పాటు చేసుకున్నామని కాంగ్రెస్ నాయకుడు, అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థి మూల వెంకట రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. మూల వెంకట రవీందర్ రెడ్డి అర్బన్ బ్యాంకు చైర్మన్ అభ్యర్థిగా రేసులో ఉన్నారనీ ఆదివారం మీడియాలో రావడం పై ఆయన వివరణ ఇచ్చారు. తాను ఒక్కడిని కలిసి ప్యానల్ ఏర్పాటు చేయలేదని అభ్యర్థుల అందరం కలిసి ప్యానెల్ ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులందరి సమిష్టి నిర్ణయమని తాను ఒక్కడి నిర్ణయం కాదన్నారు. ప్యానల్ అభ్యర్థుల మంతా కలిసి స్వయంగా వెళ్లి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మద్దతు కోరామనీ, దీంతో ఆయన ముందుకొచ్చి మద్దతు ఇచ్చారనీ, తమ ప్యానెల్ ను బలపరిచారని తెలిపారు. రాజేందర్ రావ్ ఆధ్వర్యంలో శనివారం మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిశామనీ, వారు తమ ప్యానెల్ ను ఆశీర్వదించారని తప్పకుండా గెలిచి రావాలని ఆశీస్సులు అందజేశారని పేర్కొన్నారు. వారు ఆశీస్సులు అందజేయడం తమకు ఎంతో బలాన్ని ఇచ్చిందనీ రాజేందర్ రావు ఆధ్వర్యంలో విజయం సాధించేందుకు ప్రత్యేకంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో తప్పకుండా తమ అభ్యర్థుల అందరం విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన డైరెక్టర్ల నుంచి మంత్రులు, వెలిచాల రాజేంద్రావు కాంగ్రెస్ పెద్దలు కలిసి చైర్మన్ ను నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థుల అందరం రాజేందర్ రావు మద్దతుతో ప్యానెల్ గెలుపునకు కలిసికట్టుగా గట్టిగా కృషి చేస్తున్నామని మూలా వెంకట రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. తాను అర్బన్ బ్యాంకు చైర్మన్ రేస్ లో ఉన్నట్లు వస్తున్న వార్తలను నమ్మవద్దని ఆయన తెలిపారు. అవి పుకార్లు మాత్రమేనని స్పష్టం చేశారు.

# శిలాఫలకానికే పరిమితమైన వికె రామవరం బ్రిడ్జి నిర్మాణం

- ఆదివాసి గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య





చర్య, ములకలపల్లి: శిలాఫలకానికే పరిమితమైన వికె రామవరం బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే టెండర్లు పిలిచి ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని వికె రామవరం, అన్నారం గ్రామల వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం వేసిన శిలాఫలకాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరంలో మండల పరిధిలో గిరిజన గ్రామాలకు బ్రిడ్జ్ సౌకర్యం కల్పించడానికి వికె రామవరం, అన్నారం వంతెనల నిర్మాణనికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఆర్ఆర్ గ్రాంట్ ద్వారా రూ.1.60 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేసి గాలికి వదిలేశారని ఆరోపించారు. వంతెనల నిర్మాణాలపై ప్రభుత్వం గిరిజన గ్రామాల ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వర్షాకాలంలో వంతెనల వద్ద భారీ వర్షం వచ్చినప్పుడు నీరు వరదలై పారుతూ ఆయా గ్రామాల గిరిజన ప్రజలకు తిప్పలు తప్పడంలేదన్నారు. వి.కె రామారం, కొత్తూరు, అన్నారం, చింతల పాడు, ధర్మన్ననగర్, గుర్రాలకుంట, ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలు వంతెన నిర్మాణానికి నోచుకోకపోవడంతో రవాణా సౌకర్యాం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయా గ్రామాల గిరిజన ప్రజల కష్టాలు తీర్చేది ఎన్నడని ప్రశ్నించారు. వికె రామవరం, అన్నారం గ్రామల లోలెవల్ చప్టాల స్థానంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణాలను వెంటనే ప్రారంభించి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, సోయం కృష్ణ, కుంజా భాస్కర్, పోడియం రాంమూర్తి, హేమని, వెంకటనర్సు, శ్రీను, ముత్యాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్ 362 పోలింగ్ బూత్ లో మన్ కీ బాత్ వీక్షించిన బోయినపల్లి ప్రవీణ్ రావు





చర్య :- కరీంనగర్ : ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ 127 వ ఎపిసోడ్ ను కరీంనగర్ పట్టణం విద్యానగర్ లోని 362 పోలింగ్ బూత్ కేంద్రంలో బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ దేశ ప్రజలతో మమేకమయ్యే మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది 127వ ఎపిసోడ్లో భారతీయ సంస్కృతి, పండుగల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ , జాతీయ ఐక్యత , ఆపరేషన్ సింధూర్, జిఎస్టి వంటి అనేక అంశాలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారని తెలిపారు. మోడీ ప్రసంగం ఈసారి పండుగలు, దేశభక్తి, సామాజిక బాధ్యత మేళావింపుగా నిలిచిందన్నారు. మన్ కీ బాత్ వీక్షించిన వారిలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి, జిల్లా ఎలక్షన్ కన్వీనర్ బండ రమణారెడ్డి, పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, 370 బూత్ అధ్యక్షులు, కార్యదర్శి, ఈ రెడ్డి తిరుమల్ రెడ్డి, రాయదుర్గం సోమశేఖర్ , 371 పోలింగ్ బూత్ అధ్యక్షులు అబ్బిడి మాధవరెడ్డి, చందు గౌడ్ తదితరులు ఉన్నారు.

# రీ క్రియేషన్ క్లబ్ నూతన ప్రధాన కార్యదర్శికి సన్మానం

- పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కొట్టె సదానందంకు జర్నలిస్టుల సత్కారం




ప్రెస్ క్లబ్ పెద్దపల్లి, అక్టోబర్26: ఇటీవల జరిగిన రీ క్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన సీనియర్ జర్నలిస్టు కొట్టె సదానందమును తోటి జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ప్రెస్ క్లబ్బులో జరిగిన వేడుకల్లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, భవిశ్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సదానందం మాట్లాడుతూ, తనపై నమ్మకంతో భారీ విజయాన్ని అందించిన రీ క్రియేషన్ క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో పెద్దపల్లికి మంచిపేరును తీసుకువచ్చేలా రీ క్రియేషన్ క్లబ్బును తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి గోపాల్, ఉపాధ్యక్షులు బెజ్జంకి నరేష్, తిర్రి తిరూపతి గౌడ్, కోశాధికారి ఆరెల్లి మల్లేష్, కీర్తి రమేష్, లైశెట్టి రాజు, కత్తెర్ల తిరుపతి యాదవ్, శిలారపు కిషన్, ఇజ్జగిరి వెంకటేష్, మారుపాకల అంజన్న,నల్లారపు తిరుపతి, నాగపూరి తిరుపతి గౌడ్, సంతోష్, లచ్చన్న, తిర్రి సుధాకర్ గౌడ్, కళ్యాన్, నగునూరి శ్రీనివాస్, తోట సతీష్, కత్తెరల చందర్, మచ్చార్ల వంశీ,కొయ్యాడ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# దిగుబడి తక్కువతో పత్తి రైతులు ఆందోళన

- రైతు సంఘం మండల అధ్యక్షులు చిట్టిమొదల కృష్ణ



చర్య, సత్తుపల్లి :ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి రైతులు దిగుబడి రాక ఆందోళన చెందుతున్నారని, దిగుబడి తక్కువగా ఉండటం ఒక రకమైతే, పత్తికి మద్దతు ధర లేక రైతులు కుదేలవుతున్నారని రైతు సంఘం మండల అధ్యక్షుడు చిట్టిమొదలు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం బృందం పెనుబల్లి మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలుగులోనికి వచ్చిన అంశాలను మండల అధికారులకు, జిల్లా అధికారులకు వినతిపత్రం ద్వారా తెలియజేయడం జరుగుతుందని కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమల అరుణ్ ప్రతాప్, తడికముల చిరంజీవి, బీరప్ప, బన్నీ కృష్ణయ్య, కంచి వెంకటేశం, కంటే సత్యం, శీను, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ డిఎం



చర్య, సత్తుపల్లి:సత్తుపల్లి డిపో పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రయాణీకులు డయల్ యువర్ డీఎం ద్వారా తెలియజేయవచ్చునని సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5గంటల వరకు సత్తుపల్లి డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ డయల్ యువర్ డీఎంలో ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించుటకు 9959225962 కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు అందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు




చర్య, అశ్వారావుపేట: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చైతన్యం డ్రగ్స్‌పై యుద్ధం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వికెడివిఎస్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అశ్వారావుపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా 'మాదక ద్రవ్యాల బెడద బాధ్యతాయుతమైన పౌరుడి పాత్ర' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అఖిల మాట్లాడుతూ విద్యార్థులు రాసిన వ్యాసాలను చూస్తుంటే వారికి ఎంతో అవగాహన ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అదే విధంగా యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ఈ వయసులోనే మనసును అదుపులో ఉంచుకుని, ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ



చర్చ, మణుగూరు:మండలంలోని రామానుజవరం పంచాయతీ ప్రాంగణంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ శాఖ అధ్యక్షులు లేళ్ల కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ కార్యకర్తలు మరింత చురుకుగా, సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కేసీఆర్ ఆలోచనలతో ప్రజలలోకి వెళ్లి, అభివృద్ధి పథంలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ తడికమల్ల ప్రభుదాస్, బీసీ సెల్ మండల అధ్యక్షులు అక్కి నరసింహారావు, గంధం నతానీలు, భాస్కర్, యువజన ప్రధాన కార్యదర్శి బోయిళ్ల రాజు, రాజ బోయిన కృష్ణ, సిద్దు, చింటూ, చెట్టి ప్రసాద్, ప్రభాకర్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పండించిన పత్తి పంట కొనుగోళ్లలో నిబద్ధత పాటించాలి: ఎమ్మెల్యే పాయం



చర్చ, అశ్వాపురం:రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తుందని రైతులు నష్టపోయే విధంగా ఎవరు వ్యవరించవద్దని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అశ్వాపురం మండలంలోని నెల్లిపాక గ్రామంలో శ్రీరామ జిన్నింగ్ మిల్‌లో ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజ వారి చెమట చుక్క కష్టమని, తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లు యాజమాన్యం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


# అధ్వానంగా తయారైన రోడ్ల వద్ద బీఆర్ఎస్ ధర్నా



చర్చ, అశ్వారావుపేట: అధ్వాన్నంగా మారిన రహదారుల వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలో రోడ్లు ఎక్కడికక్కడ గుంటలు పడి, వర్షపు నీరు నిలిచిపోయి అధ్వానంగా తయారవడంతో పలుమార్లు ప్రభుత్వానికి పరిస్థితిని తెలియజేసినప్పటికీ మరమ్మత్తులు చేయకపోవడంతో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నేతలు నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనబాట పట్టారు. జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపుతో గోతులతో సెల్ఫీ కార్యక్రమాన్ని చేపట్టిన నిరసన చేపట్టారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీనికూడా 25% కూడా అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను దగా చేయడమే కాకుండా ఈ రెండేళ్ల పాలనలో రోడ్లపై తట్టెడు మట్టి కూడా పోయలేదని టిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సెంట్రల్ లైటింగ్ పనులకు నాటి బీఆర్ఎస్ హయాంలోనే రూ.23.50 కోట్లు నిధులు తెచ్చి భూమి పూజ చేసినప్పటికీ, ఆ పని పూర్తి చేయడం కూడా కాంగ్రెస్‌కు చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. తక్షణమే గుంతలు పడిన రోడ్లు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయడానికి సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపు (సోమవారం) ప్రజావాణి రద్దులి

- కలెక్టర్ పమేలా సత్పతి




చర్చ :- కరీంనగర్ :జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో నిర్వహించే రేపు (సోమవారం) ఈ నెల 27 వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం నిర్వహించే ఆడిటోరియంలో మద్యం దుకాణాల టెండర్ కు సంబంధించిన డ్రా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని ఆమె సూచించారు.

# మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే



చర్చ, అశ్వారావుపేట:అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు జారె ఆదినారాయణ ఆదివారం మండల వ్యాప్తంగా వృస్తృతంగా పర్యటించారు. వివిధ గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల స్థితిగతులను



పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, లబ్ధిదారులకు సూచించారు. ఉసిర్లగూడెం, వినాయకపురం గ్రామాలలో జరిగిన శుభకార్యాలలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కామయ్యపాలెం గ్రామంలో వీరంకి ప్రసాద్ దశదిన కార్యక్రమంలో పాల్గొని ప్రసాద్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దొంతికుంటలో నూకాలమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇతర బ్యాంకులకు దీటుగా కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ను తీర్చిదిద్దుతాం

- నీతిగా ఉంటాము..
- నిజాయితీగా సేవలందిస్తాం..
- అర్బన్ బ్యాంకు డిపాజిటర్ల
- నమ్మకాన్ని వమ్ము చేయబోము..
- ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడండి..
- మేమెంటో చూపిస్తాం..
- జగిత్యాల ఓటర్ల బలంతో
- మా ప్యానల్ గెలుపు ఖాయం..
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మద్దతుతో పాటు గాదే కార్తీక్, అనిల్ కుమార్ ను ప్రతిపాదించడం వెయ్యి ఏనుగుల బలం వచ్చింది..
- మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ఆశీస్సులు అందించారు..
- జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు
- అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులతో కలిసి ప్రెస్ మీట్..




కరీంనగర్ :ఎన్నికల్లో తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపిస్తే ఇతర బ్యాంకుల కంటే మరింత మెరుగ్గా అత్యుత్తమ బ్యాంకుగా కరీంనగర్ అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. తమ ప్యానెల్ అభ్యర్థులు నీతిగా నిజాయితీగా సేవలందిస్తారని ఏలాంటి మచ్చలేని వారు తమ ప్యానల్ లో ఉన్నారని తెలిపారు. కరీంనగర్ తో పాటు జగిత్యాల ఓటర్ల అదనపు బలంతో తమ ప్యానెల్ కచ్చితంగా అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కార్యాలయంలో ఆదివారం వెలిచాల రాజేందర్ రావు అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ అభ్యర్థులను పరిచయం చేశారు. అనంతరం రాజేందర్ రావు మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మెరికల్ లాంటి ఇద్దరు యువకులు గాదె కార్తీక్, అనిల్ కుమార్ ను ప్రతిపాదించారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడంతో పాటు మంచి వ్యక్తులను ప్రతిపాదించడం 1000 ఏనుగుల బలాన్ని ఇచ్చిందని రాజేంద్రరావు సంతోషం వ్యక్తం చేశారు. గాదే కార్తీక్ తండ్రి గాలి వేణుగోపాల్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ గా పని చేశారని తెలిపారు. అనిల్ కుమార్ కౌన్సిలర్ గా పని చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతోపాటు వీరిద్దరి కృషి వల్ల జగిత్యాల నియోజకవర్గం నుంచి 80% ఓట్లు తమ ప్యానెల్ సాధించడం ఖాయమన్నారు. అదేవిధంగా ఇటీవల మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ప్యానల్ అభ్యర్థులకు ఆశీస్సులు అందజేశారని తెలిపారు. మంత్రులు విప్ ప్యానల్ గెలిచి రావాలని ఆశీర్వాదం అందించడం తమకు ఎంతో రెట్టింపు ఉత్సాహాన్ని బలాన్ని ఇచ్చిందని రాజేందర్ రావు చెప్పారు. తమ ప్యానెల్ లో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ మంచి పేరు సంపాదించుకున్న వారు ఉన్నారని అదేవిధంగా గతంలో అర్బన్ బ్యాంకు డైరెక్టర్గా పనిచేసిన అనుభవం ఉన్నవారు ఉన్నారని దీనికి తోడు కాంగ్రెస్ బావాజాలం.. కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్నవారు ఉండడం తమకు ఎంతో కలిసొచ్చే అంశమని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన వారి పనితీరు తమ ప్యానెల్ అభ్యర్థుల వ్యక్తిత్వము ఆలోచన తీరు పనిచేసే విధానము నిజాయితీ ని చూసి అర్బన్ బ్యాంకు ఓటర్లు ఆశీర్వదించి పట్టంకట్టాలని వెలిచాల రాజేంద్రరావు విజ్ఞప్తి చేశారు. తమ ప్యానల్ అభ్యర్థులతో అర్బన్ బ్యాంకు దశ దిశను మార్చి వేస్తామని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు డిజిటలైజేషన్ సిస్టం ప్రవేశపెడతామని రాజేంద్రరావు ప్రకటించారు. ఒకటి రెండు రోజుల్లో తమ మేనిఫెస్టోను విడుదల చేస్తామని తెలిపారు. గతంలో కొందరి ప్రమేయం వల్ల అవినీతి ఆరోపణలు అనేకం వచ్చాయన్నారు. అర్బన్ బ్యాంకు డిపాజిటర్ల లో అభద్రత భావాన్ని పెంచేలా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. డిపాజిటర్లు ఇన్వెస్టర్లు భయాందోళనలు చెందేలా కొంతమంది వ్యవహరించారని పేర్కొన్నారు. స్వచ్ఛమైన నిజాయితీవంతమైన పట్టుదలతో వచ్చిన తమ ప్యానల్ అభ్యర్థులను అర్బన్ బ్యాంకు ఓటర్లు ఆదరించాలని కోరారు. అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఒక్క ఛాన్స్ ఇస్తే అర్బన్ బ్యాంకు రూపురేఖలే మారుస్తామని అనేక సంస్కరణలు తీసుకొస్తామని రాజేంద్రరావు హామీ ఇచ్చారు. ప్యానల్ అభ్యర్థులంతా పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, గాదె కార్తీక్, కూసరి అనిల్ కుమార్, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బట్టు వరప్రసాద్, అనంతుల రమేష్, కనకరాజు, పొన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయండి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు




చర్చ, అశ్వాపురం:డిసెంబర్ 26న ఖమ్మం లో జరగనున్న సీపీఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్టీ మండలం సహాయ కార్యదర్శి మేలపుర సురేందర్ రెడ్డి అధ్యక్షతన అశ్వాపురం మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమటం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు వేల సంఖ్యలో ప్రతి మండలం, పట్టణం, గ్రామం నుంచి తరలి వెళ్లేందుకు జన సమీకరణ, వాహనాల సమీకరణపై నాయకత్వం దృష్టిసారించిందన్నారు. 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు మన భారతదేశ నలుమూలల నుండే కాకుండా, 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు అశ్వాపురం మండలం నుంచి వేలాదిగా ఖమ్మం తరలించాలని పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీకి భారతదేశ రాజకీయాలలో ఒక ప్రత్యేక స్థానం ఉందని, అధికారం లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమం సాధనే ధ్యేయంగా పనిచేసిందన్నారు. సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగి అనేక పోరాటాలను అందించిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో డిసెంబర్ 26న జరగనున్న నేపథ్యంలో పార్టీ ఉద్యమ చరిత్రను ఇంటింటికి తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి, మండలం సహాయ కార్యదర్శులు మేలాపుర సురేందర్ రెడ్డి, అనంతనేని శేఖర్, కొండపర్తి ప్రసాద్, జక్కుల రామచంద్రరావు, కమటం సురేష్, అక్కినపల్లి నాగేంద్రబాబు, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, దండి నాగేష్, మహిళా సమైక్య నాయకులు, కొల్లు ఆశ, తెల్లం వెంకటరమణ, తురక అచ్చమ్మ, తోట వెంకట నరసయ్య, ఇరుగు శ్రీకాంత్, కొత్తపల్లి సత్యనారాయణ, వాంకుడోత్ బాలాజీ, బండ్ల తిరుపతిరావు, సబ్కా అజయ్, తదితరులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ పార్టీ జీవనది లాంటిది





చర్చ, వైరా: : భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి ఎవరు బయటకు వెళ్లినా పార్టీకి నష్టం లేదని, బిఆర్ఎస్ పార్టీ జీవనది లాంటిదని, రాబోయే రోజులలో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని పలువురు పార్టీ నాయకులు ఉద్ఘాటించారు. వైరా పట్టణ బిఆర్ఎస్ పార్టీ 20 వార్డుల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం పట్టణ అధ్యక్షులు మద్దెల రవి అధ్యక్షతన స్థానిక శ్రీనికేతన్ స్కూల్ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాబోయే స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ ఎలా ముందుకుపోవాలి, అనుసరించవలసిన వ్యూహాలు, వాటి యొక్క ప్రణాళికల గురించి ప్రజాప్రతినిధులు, నాయకులు వివరించారు. ఈ సందర్భంగా వివిధ హోదాలలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు%కా% సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. టెండర్లలో నీకెంత... నాకెంత అనే విధానంతో రాష్ట్రానికి రావలసిన పెట్టుబడులు రాకపోగా అగమ్యగోచరంగా తయారుచేశారన్నారు. ఆరు గ్యారెంటీలను అటకెక్కించి ముఖ్యమంత్రి దగ్గరి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు వాటాల గురించి ఆలోచిస్తున్నారని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచులుగా, ఎంపిటీసీలుగా, జడ్పీటీసీలుగా కౌన్సిలర్లుగా గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా దిశా కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జున రావు, పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, జిల్లా వర్తక సంఘం అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకులు వనమా విశ్వేశ్వరరావు, మాజీ కౌన్సిలర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు వివిధ హోదాలలో పనిచేసిన నాయకులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం వర్కర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సిఐటియు జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు



చర్చ, మణుగూరు: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజనం వర్కర్ల సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నాయని, నెలలు గడుస్తున్నా వేతనాలు, వంట బిల్లులు పడలేదని, తక్షణమే పెండింగ్ జీతాలు, బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం వర్కర్ల సమావేశం స్థానిక శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి శైలజ అధ్యక్షత వహించగా సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు కిరాణా షాపుల దగ్గర అప్పులు చేసి సరుకులు తీసుకొస్తూ పిల్లలకి వడ్డిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారికి చెల్లించాల్సిన బిల్లుల పట్ల, జీతాల విషయంలో స్పందించట్లేదని ఆరోపించారు. వంట చేసే సమయంలో పొగ వల్ల కంటిచూపు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని, ప్రభుత్వం ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకులు కొడిశాల రాములు మాట్లాడుతూ 40 సంవత్సరాల తర్వాత సిఐటియు జిల్లా మహాసభలు మణుగూరు పట్టణంలో జరుగుతున్నాయని, ఈ మహాసభలకు పట్టణ ప్రజలు, కార్మికులు అందరూ సహాయ సహకారాలు అందించి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ నాయకురాలు డి. రమాదేవి, ఎం. మునెమ్మ, కే సరిత, సిహెచ్ విజయ, కృష్ణవేణి, లలిత, నాగరత్నం, చంద్రమ్మ, జి. సీత తదితరులు పాల్గొన్నారు.

# 'గంజాయి' నిందితులపై పీడీ యాక్ట్




చర్చ, ఇల్లందు:నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడి జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులలో నిందితుడిగా ఉన్న సపావత్ వెంకన్న అనే వ్యక్తిపై ఇల్లందు పోలీసులు పీడియాక్టును నమోదు చేశారు. ఎస్పీ రోహిత్ రాజు సూచనల మేరకు ఇల్లందు డిఎస్పీ చంద్రభాను సలహాలతో ఇల్లందు సీఐ సురేష్ మహబూబాబాద్ జిల్లాకు చెందిన నిందితుడు వెంకన్నపై పీడియాక్ట్ నమోదుకై ఉన్నతాధికారులకు తగిన పత్రాలను సమర్పించారు. అక్రమార్జనే ధ్యేయంగా నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడు వెంకన్నపై ఇల్లందు, భద్రాచలం, హైదరాబాద్ రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయని సీఐ సురేష్ తెలిపారు. ఖమ్మం సబ్ జైలులో ఉన్న నిందితుడిపై పీడియాక్టును అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఆ ఉత్తర్వుల కాపీని నిందితుడికి చర్లపల్లి జైలులో అక్కడి అధికారుల సమక్షంలో అందించినట్లు తెలిపారు. నిందితుడు సపావత్ వెంకన్నపై పీడి యాక్ట్ నమోదయ్యేలా కృషి చేసిన ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, సీఐ సురేష్, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

సోమవారం, అక్టోబర్ 27, 2025

చర్చ
తెలుగు దిన పత్రిక



# వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ రఘురాం రెడ్డి
- జాబ్ మేళాను ప్రారంభించిన ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే రాగమయి
- విజయవంతంగా 'సింగరేణి' మెగా జాబ్‌మేళా
- భారీగా హాజరైన నిరుద్యోగులు









**చర్చ, సత్తుపల్లి:** స్థానిక రాణి సెలబ్రేషన్స్ హాల్‌లో సింగరేణి సహకారంతో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దంపతుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటి అండ్ ఇండస్ట్రీస్ అనుబంధ టాస్క్ వారు ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జాబ్‌మేళాను ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఏం తిరుమలరావు , సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురామిరెడ్డి మాట్లాడుతూ మన దేశంలో జనాభా ఎక్కువ, ఉద్యోగాలు తక్కువ అని, కాబట్టి వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని ఏ ఉద్యోగమైనా, ఎంత దూరంలో ఉన్నా చేయాల్సి వచ్చినా ముందడుగు వేయాలన్నారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదివిస్తూ జీవితంలో స్థిర పడాలనుకుంటారని, కానీ యువత లక్షల జీతాల కోసం వేచి చూస్తూ, దూర ప్రాంతాలకు వెళ్లడానికి సంకోచిస్తూ తల్లిదండ్రులకు భారం అవుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాను నిర్వహించామని, ఏ ఉద్యోగానికైనా అనుభవం అడుగుతారని, కానీ ఈ మేళాలో అనుభవంతో పనిలేకుండా ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగం సాధించినవారు ఆర్థికంగా బలపడి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సింగరేణి డైరెక్టర్ (ఇ అండ్ ఎం) తిరుమలరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే తపనతో ఎమ్మెల్యే తమ సంస్థను కోరగా ఈ జాబ్ మేళా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మెగా జాబ్‌మేళాలో సుమారు 70 కంపెనీలు పాల్గొనగా, 12 వేల మంది నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని మేళాకు విచ్చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు దరఖాస్తులు చేసుకున్న వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికోసం బస్టాండ్ నుండి జాబ్ మేళా నిర్వహించే ప్రదేశం వరకు ఉచిత స్కూల్ బస్సులు ఏర్పాటు చేశారు. ఉద్యోగాలు సాధించిన వారిలో అధిక శాతం మహిళలే ఉన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నైపుణ్యంతో ఎదగాలి

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం నా బాధ్యత
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** స్వయం కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యం అని, పిల్లలకు విద్య అందించడం ద్వారా కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిలో విశేష మార్పు తీసుకురావచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆదివారం పాల్వంచ మండలంలోని బండ్రుగొండ పంచాయతీ పరిధిలోని కోయగట్టు గొత్తికోయ గ్రామాన్ని ఆయన సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడి అభివృద్ధి చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి గ్రామంలో మట్టితో ఇటుకలు తయారీ విధానాన్ని స్వయంగా ప్రదర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతీ చిన్న పనికీ ప్రభుత్వంపై ఆధారపడకుండా, స్వయం కృషితో ముందుకు సాగాలని గ్రామస్తులను ప్రోత్సహించారు. ఉదయం పూట ఖాళీ సమయాన్ని వినియోగించి, వారు స్వయంగా ఇటుకలు తయారు చేసుకుని గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణానికి ఉపయోగించుకోవాలని సూచించారు. అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అటవీ ప్రాంతంలో చెట్లు నరకకుండా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యామ్నాయ జీవనాధారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో గ్రామస్తులు చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం, వెదురు సాగు వంటి ఉపాధి మార్గాలను ఎంచుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చని ఆయన తెలిపారు. భావి తరతరాల అభివృద్ధికి విద్యే పునాది అని, గ్రామంలోని పిల్లలు చదువులో ముందుకు సాగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. చదువుకున్న యువతకు ప్రభుత్వం అందించే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలను ఉపయోగించుకుని స్వయం ఉపాధిని సాధించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కలిగిన యువతను ఉపాధి అవకాశాలతో కలిపే బాధ్యతను నేను స్వయంగా తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల చొరవతోపాటు అధికారుల కృషి కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి, ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీఓ పోరండ్ల రంగా, ఆర్ఐ ప్రసాద్, అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్, ఈసీలు రాజు, తిరుపతయ్య, గ్రామ కార్యదర్శులు నారాయణ, ప్రవీణ్ కుమార్, శంకర్, రాములు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నందా తండా గ్రామపంచాయతీ కి సొంత కార్యాలయం ఎక్కడ

- పల్లె దవాఖానాకు దారేది





**భద్రాద్రి కొత్తగూడెం, 26 అక్టోబర్ చర్చ బ్యూరో :** కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి మండలం, బృందావనం నుండి బంజారాహిల్స్ వరకు గల నంద తండ గ్రామపంచాయతీ కి సొంత పంచాయతీ కార్యాలయ భవనం లేదు. పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు ఉన్న స్థల సేకరణకు జాప్యం జరుగుతుంది. అధికారులకి పంచాయతీ పరిదధుల మీద అవగాహన లేకపోవడం అందుకు గల ఒక కారణం. పంచాయతీ పరిధిలోగల కొందరు గ్రామస్తులు కూడా, పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామస్తుల నడకకు, రవాణాకు సంబంధించిన రోడ్డు దారులను ఆక్రమణ చేశారు. వారిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల అనుచరులు కూడా ఉన్నారు. నంద తండ గ్రామ పంచాయతీలో గల పల్లె దవాఖాన కూడా దారి మార్గంలోనే నిర్మించబడింది. పల్లె దవాఖానా వెనుక వీధిలో ఉన్న గ్రామస్తులకు అదే ప్రధాన దారి. ఇప్పుడు పల్లె దవాఖాన కు దారి మూసి వేయబడింది. పల్లె దవాఖానా ను ఆనుకొని ఉన్నటువంటి వెనుక స్థలం నుండి, నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్న ఓల్డ్ వాటర్ ట్యాంక్ వరకు పంచాయతీ స్థలం కలదు. అట్టి పంచాయతీ స్థలము ఆక్రమణకు గురి అయ్యే అవకాశం ఉన్నది. అట్టి స్థలం నిరుపయోగంగా ఉండడం వలన చెట్లు పెరిగి, వర్షాలు పడడం వల్ల గుంతలు ఏర్పడి, మురికి నీరు చేరి పాములకు, దోమలకు అడ్డాగా మారింది. ఈ వీధిలో శానిటైజేషన్ కూడా పంచాయతీ కల్పించడం లేదు. ఈ వీధిలో ఉన్న గ్రామస్తులకు రోడ్డు కూడా లేదు. అట్టి పంచాయతీ స్థలంలో కొందరు గ్రామస్తులు బర్రెలను కట్టి వేయడం వల్ల రోడ్డు మార్గం దారుణంగా తయారయింది. పల్లె దవాఖానకు వచ్చే రోగులకు ఈ రోడ్డు మార్గం మరింత కఠినంగా మారింది. గ్రామస్తులు పదుల సార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేయగా, రోడ్లను ఆక్రమించి బర్రెలను కడుతున్న వారిపై నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసి నెలలు గడుస్తున్నా పట్టింపు లేని రైతు, పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం వల్ల ఆ వీధిలో ఉన్న గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. పల్లె దవాఖానకు అనుకొని ఉన్న పంచాయతీ స్థలం గ్రామపంచాయతీ కార్యాలయానికి అనువుగా, పంచాయతీ అభివృద్ధికి కేంద్రంగా ఉంటుంది. అట్టి స్థలాన్ని గ్రామ పంచాయితీ అధికారులు స్వాధీనం చేసుకొని గ్రామ పంచాయితీ కార్యాలయ భవనం నిర్మించాలని, రోడ్లు, వీధి లైట్లు, మెషిన్ భగీరథ నీరు, చెత్త కుండీలు, శానిటైజషన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని అక్కడి గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# కపిలవాయి కార్నర్ మీటింగ్‌ను జయప్రదం చేయండి : కట్ట సతీశ్



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ఎన్నికల హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తు రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర మంగళవారం కొత్తగూడెం చేరుకోనున్నట్టు రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుదుతు స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు, తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికై 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ, నిరుద్యోగ భతి బకాయిల చెల్లింపు, యువత రాజకీయంలోకి రావాలి తెలంగాణను ఏలుకోవాలనే లక్ష్యంతో రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర రేపు అనగా 28వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కర్నార్ మీటింగ్ ను విజయవంతం చేయాలని రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్ పిలుపునిచ్చారు.

# వాసవి అమ్మవారి ఆలయానికి స్టీలు బల్లలకై రూ.10 వేలు వితరణ



**చర్చ, అశ్వారావుపేట:** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ మాజీ అధ్యక్షులు జల్లిపల్లి దేవరాజు స్థానిక వాసవి అమ్మవారి ఆలయానికి స్టీలు బల్లల ఏర్పాటు నిమిత్తం రూ.10 వేలు వితరణగా అందించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో నిర్వహించే భోజన కార్యక్రమంలో బల్లలు లేవని తెలుసుకొని వాటి ఏర్పాటు కోసం రూ. 10 వేలను ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు ముత్తా సుమాకర్ కి అందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సత్యవరపు బాలగంగాధర్, రీజనల్ చైర్మన్ బోగవల్లి రాంబాబు, దూబగుంట్ల శ్రీను, జల్లిపల్లి ఖాదర్ బాబు, సమయవంతుల సత్యనారాయణ స్వామి, గుడివాడ సతీష్, కంచర్ల కిరణ్, కాకి రాము, సీమకుర్తి సుబ్బారావు, కలకోటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్న ప్రసాద వితరణ





**చర్చ, సత్తుపల్లి:** స్థానిక శ్రీ హరి హరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఇమ్మనేని శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో 400 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్టోబర్ 30వ తేదీ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా టీజీఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6:30కు మహా పడిపూజ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ వార్షికోత్సవ మహా పడిపూజ, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందవలసిందిగా గౌరవాధ్యక్షులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దురిసేటి శ్రీనివాస్, ప్రచార కార్య దర్శి పోలిశెట్టి శివకుమార్, సహాయ కార్యదర్శి గుడిమెట్ల సోమేశ్వరరావు, సహాయ కార్య దర్శి ఇమ్మనేని శ్రీనివాసరావు, దోసపాటి రామచంద్రరావు, సురేష్ కేశవ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బీ.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా పండుగ



**చర్చ, అశ్వారావుపేట:** బిఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆదివారం జండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత తెలంగాణ తల్లికి పూలమాల వేసి జై తెలంగాణ నినాదాలు చేశారు. బిఆర్ఎస్ కేంద్ర పార్టీ ఆదేశాలతో జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, అశ్వారావుపేట పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరావు ఆదేశానుసారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ బలోపేతం గురించి కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా శిఖరంలలా నిలబడే ప్రభుత్వం గులాబీ ప్రభుత్వం అని, తెలంగాణ ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్ రావు, మాజీ వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, నియోజకవర్గ నాయకురాలు వగ్గెల పూజ, మండల నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి, జుజ్జూరపు శ్రీరామ్మూర్తి, జ్యోత్స్న భాయ్, రహీమున్ బేగం, గోవింద్, సోమని రమేష్, రఘురాం, అమీర్, హరి, మోటూరీ మోహన్, తాళం సూరి, చరణ్, ఉస్మాన్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి



**చర్చ, అశ్వారావుపేట:** మండలంలోని ఉసిర్లగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన ఉప్పాల రాజశేఖర్, ఉష దంపతుల కుమార్తె అనూహ్య సాయి ఓణీల అలంకరణ వేడుకలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని చిన్నారికి నూతన వస్త్రాలు బహుకరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అంకిత మల్లికార్జున్ రావు, వినాయకపురం మాజీ సర్పంచ్ పొట్ట రాజులు, వగ్గల పూజ, పొట్ట రాము, ప్రతాప్, యుగంధర్, సత్యనారాయణ, కనకం, వన్నం బాబు, మిండ శ్రీను, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 150 మస్టర్ల కండిషన్‌ను విరమించుకోవాలి

- జిఎల్‌బీకేఎస్ డిమాండ్



**చర్చ, కొత్తగూడెం (సింగరేణి):** సింగరేణి కార్మికులు సంవత్సరంలో తప్పనిసరిగా 150 మస్టర్లు చేయాలని, లేని యడల వారిపై చర్యలు తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం సర్కులర్ విడుదల చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ జె. సీతారామయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గైర్హాజరవుతున్న కార్మికులను డ్యూటీలు చేయించేందుకు ఉద్దేశించబడిన సర్క్యులర్‌గా యాజమాన్యం నమ్మించే ప్రయత్నం చేస్తున్నదని, కాని కార్మికులను కుదించాలనే ఆలోచనతో దొడ్డిదారిన చేస్తున్న ప్రయత్నంగా అభివర్ణించారు. తీవ్ర అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితిలో ఉన్న కార్మికులను మెడికల్ బోర్డులో అన్ ఫిట్ చేయాల్సి ఉండగా వారిని ఫిట్ చేసారని, వారసుల ఉద్యోగాలు ఎగ్గొట్టేందుకు ఫిట్ చేసి ఇప్పుడు 150 మస్టర్లు కండీషన్ పెట్టి ఇంటికి పంపే కుట్ర పన్నిందన్నారు. తక్షణమే సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సర్క్యులర్‌ను ఆపేందుకు సిద్ధం కావాలని, ఇందుకు యాజమాన్యం మొండికేస్తే అన్ని సంఘాలను కలుపుకొని తగిన కార్యాచరణను రూపొందించి సర్క్యులర్ రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని అన్నారు.

## రామవరంలో ముమ్మరంగా సిపిఐ ఇంటింటి ప్రచారం



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** సిపిఐ శతవసంతాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా వాడవాడలా వందేళ్ల వేడుకలు జరుపుకోవాలని, వేడుకల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య కోరారు. సిపిఐ శతవసంతాలు పురస్కరించుకొని పట్టణంలోని రామవరం, బూడిదగడ్డ ఏరియాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సిపిఐ వందేళ్ల చరిత్రను ముద్రించిన కరపత్రాలు అందించి ఉత్సావాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ డిసెంబర్ 25వరకు పట్టణంలోని అన్ని పార్టీ శాఖల్లో జెండా పండుగలు జరుపుతున్నామని, పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ప్రచార జాతాల సందర్భంగా బహిరంగ సభలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో జరిగే జాతీయ స్థాయి ముగింపు ఉత్సావాల బహిరంగ సభకు పట్టణం నుంచి 10వేల మందిని తరలించేందుకు కార్యాచరణ రూపొందించి ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సావాలని ప్రజలు సహకరించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, పద్మ, నేరెళ్ల రమేష్, నాయకులు గోపికృష్ణ, గుత్తుల శ్రీనివాస్, సందెబోయిన శ్రీనివాస్, డి గురుమూర్తి, తూముల శ్రీనివాస్, ఖయూమ్, జలీల్, పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం భద్రాచలం కొత్తగూడెంలో ప్రజావాణి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలోని భూసమస్యల పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నందున, వారి సౌకర్యార్థం డివిజన్ల వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు భూసమస్యల పరిష్కారం కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో, కొత్తగూడెం డివిజన్ పరిధిలోని ప్రజలు కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో దరఖాస్తులు అందచేయాలన్నారు. ఇతర సమస్యలపై దరఖాస్తు చేసుకునేవారు కలెక్టరేట్లోని ఇన్వార్డు నందు తమ దరఖాస్తులను అందజేసి రసీదు పొందాలని సూచించారు. దరఖాస్తుల సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## సిరిసిల్లలో విషాదం.. పాముకాటుకు 18 నెలల చిన్నారి బలి

**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం నెలకొంది. ఓ 18 నెలల చిన్నారి పాము కాటుకు బలైంది. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలం అసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రమేశ్, సుమలత అనే దంపతులు తమ బిడ్డ(18 నెలలు) వేదాన్షితో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే పసిపాప శనివారం రాత్రి తన ఇంటి ముందు ఆడుకుంటుండగా, పాము కాటేసింది. చిన్నారి ఆ నొప్పి భరించలేక గట్టిగా ఏడ్చింది. దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు పాపను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.వేదాన్షి మృతితో రమేశ్, సుమలత గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## ఓదెలలో మంచు తుఫాను.. రైళ్ల రాకపోకలకు అంతరాయం

**ఓదెల, అక్టోబర్ 26 :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో ఆదివారం తెల్లవారుజామున మంచు తుఫాను కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో మంచు తుఫాను కురిసింది. దాదాపు 100 మీటర్ల దూరంలో ఉన్న రహదారి కూడా కనిపించక రోడ్ల వెంబడి వెళ్లే వాహన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.రైల్వే మార్గంలో కూడా విపరీతంగా మంచు కురిసింది.

ఈ క్రమంలో లోకోపైలట్లకు సిగ్నల్స్ సరిగా కనిపించక రైళ్ల వేగాన్ని తగ్గించి నడిపించినట్లు తెలిసింది. దీంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఉదయం 9 గంటల వరకు మంచు దుప్పటి కమ్మేసి ఉంది. ఇంటి ఎదురు ఇల్లు కూడా కనిపించనంతగా గ్రామాల్లో మంచు నిండిపోయింది. మంచు తుఫానును చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. వాహనదారులు ముందు హెడ్లైట్లను వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. ఈ కారణంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## చాదర్ఘాట్ కాల్పుల కేసులో దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్:** చాదర్ఘాట్ విక్టోరియా గ్రౌండ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇవాళ(ఆదివారం) మరోసారి ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఫోరెన్సిక్ టీమ్తో క్లూస్ సేకరిస్తున్నారు. కాల్పుల ఘటన కేసులో %దీఅం% 304, 109, 132 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సుల్తాన్ బజార్ పోలీసులు తెలిపారు. డీసీపీ చైతన్యకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితుల్లో మహమ్మద్ ఒమర్ అన్సారీ చికిత్సపొందుతుండగా.. మరో దొంగ పరారీలో ఉన్నారు. అతని కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మరోవైపు నిందితుడు మహమ్మద్ ఒమర్ అన్సారీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.అయితే.. చాదర్ఘాట్ సమీపంలో శనివారం సాయంత్రం ఇద్దరు స్నాచర్లు సెల్ఫోన్లు కొట్టేసేందుకు యత్నించగా అడ్డుకున్న పోలీసులపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మొబైల్ స్నాచింగ్ చేసి పారిపోతున్న మహమ్మద్ ఒమర్ అన్సారీ.. ఎదురుతిరిగి గన్మెన్ సత్యనారాయణ మూర్తిపై కత్తితో దాడి చేశాడు. ఇది గమనించిన సౌత్ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్ తన దగ్గర ఉన్న గన్తో అన్సారీపై రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ఒక తూటా భుజంపై, మరొకటి ఛాతీ భాగంలో తగలటంతో అన్సారీ కిందపడిపోయాడు. దీంతో వెంటనే అన్సారీని.. అలాగే గాయపడిన డీసీపీని, గన్మెన్ను పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు.కాగా, ఇవాళ(ఆదివారం) డీసీపీ చైతన్య, గన్మెన్ సత్యనారాయణమూర్తి హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. మరోవైపు బంజారాహిల్స్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఒమర్ అన్సారీకి చికిత్స కొనసాగుతోంది. అయితే.. ఇప్పటికే అన్సారీపై 20 కేసులు, రెండు సార్లు పీడీ యాక్టులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవలే రెండేళ్లు జైలుకెళ్లి వచ్చినట్లు పేర్కొన్నారు. జైలు నుంచి వచ్చిన తర్వాత తన కార్యకలాపాలపై ఫోకస్ పెట్టినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఘటన చోటుచేసుకుందని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు ఇవాళ అన్సారీకి శస్త్ర చికిత్స నిర్వహించనున్నట్లు సమాచారం.

## గొర్రెల మందపై చిరుత దాడి.. చివరకు చెట్టుపై

**జయశంకర్ భూపాలపల్లి:** మహాముత్తారం మండలంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. జీలపల్లి గ్రామ పరిధిలోని పర్లపల్లి సమీపంలో గొర్రెల మందపై శనివారం రాత్రి చిరుతపులి దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గొర్రెల మందను యజమాని మేడిపల్లి రామయ్య షెడ్డులోకి తోలి రాత్రికి ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇవాళ(ఆదివారం) తెల్లవారుజామున షెడ్డుకు వచ్చి చూసేసరికి గొర్రెలు అన్ని చెల్లాచెదురై, గాయాలతో పడి ఉన్నాయి. అందులో రెండు గొర్రెలు మృతి చెందినట్లు రామయ్య తెలిపాడు. గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేశాడు.

## తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు.. పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ



**హైదరాబాద్ :**తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల ఐదురోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.మంగళశారం జయశంకర్ భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది.బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

## చారిత్రక ఓరుగల్లు కోటలో సమస్యల తిష్ట.. అల్లాడిపోతున్న పర్యాటకులు



**వరంగల్, అక్టోబర్ 26:** చారిత్రక వైభవానికి, కాకతీయుల కళా నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే ఓరుగల్లు కోట (వరంగల్ కోట) ఇప్పుడు సమస్యల కోటగా మారింది. కోట అందాలను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి వస్తున్న పర్యాటకులకు కనీస మౌలిక వసతులు కరువై వెనుదిరిగి వెళు_న్నారు. మరోవైపు, కోటలో పంటలు పండించే రైతులు పంట దిగుబడిని మార్కెట్కు తరలించడానికి ముళ్ల పొదలు, చెత్తాచెదారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పర్యాటకులకు చేదు అనుభవంకోట చుట్టూ నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ మొక్కలు ఏకంగా రోడ్డును కమ్మేయడంతో, పర్యాటకుల కార్లలో వెళ్లడం పక్కన పెడితే కనీసం నడుచుకుంటూ వెళ్లి కోట చారిత్రక కట్టడాలను, అందాలను వీక్షించలేని దుస్థితి ఏర్పడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ఈ దీన స్థితిని చూసి నిరాశతో కోటను పూర్తిగా చూడకుండానే వెనుతిరిగిపోతున్నారు. రోడ్డుకిరువైపులా చెట్లు పెరిగిన విషయం తెలియని పర్యాటకులు తమ విలువైన కార్లతో లోపలికి వస్తున్నారు. దీంతో కారుకు గీతలు పడడంతో పర్యటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని అధికార యంత్రాంగం తీరుపై పర్యాటకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంరైతుల పరిస్థితి మరింత దయనీయంఓరుగల్లు కోటలో, పరిసర ప్రాంతాలలో ఆకుకూరలు, కూరగాయలు పండించే రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పండించిన పంటను, కూర మూటలను మార్కెట్కు తరలించడానికి కోట చుట్టూ ఉన్న రహదారి వెంట పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి చెట్ల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటను మోసుకెళ్లే మార్గం సరిగా లేక, తరలింపు సమస్యగా మారి ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారా..?అసలు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారా? అని స్థానికులు, పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. సమీక్షలు, సమావేశాలకే పరిమితమై, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి ఎటువంటి కార్యాచరణ లేదని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. చారిత్రక కోటకు ఈ దుస్థితి పట్టడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.?కోట చుట్టూ ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్ల పొదలు, పిచ్చి చెట్లను తక్షణమే తొలగించాలని స్థానికులు, రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. పర్యాటకులకు, రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని, ప్రజా ప్రతినిధులను వారు కోరుతున్నారు. ?చారిత్రక వారసత్వ సంపదగా ఉన్న ఓరుగల్లు కోట పరిరక్షణ, అభివృద్ధి పట్ల పాలక వర్గాలు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఆధార్ లింక్ చేయకుంటే వేతనాలు ఆపేస్తం అన్నిశాఖల ఉన్నతాధికారులకు ఆర్థికశాఖ ఆదేశాలు



**హైదరాబాద్:** ప్రభుత్వంలో పనిచేసే అన్ని రకాల ఉద్యోగుల ఆధార్, సెల్ఫోన్ నంబర్తోసహా పూర్తి వివరాలను శనివారం అర్ధరాత్రిలోగా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్కుమార్ సుల్తానియా శనివారం అన్ని శాఖల ఉన్నతాధికారులకు సర్క్యులర్ పంపించారు. పోర్టల్లో వివరాలు పొందపర్చని ఉద్యోగుల అక్టోబర్ నెల వేతనాలను విడుదల చేయబోమని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో శాశ్వత, తాతాలిక ఉద్యోగులు మొ త్తం 10.14 లక్షల మంది ఉన్నారు. వీరందరి పేర్లు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్లు తదితర వివరాలన్నీ ప్రతి నెలా 10 వరకు ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)లో నమో దు చేయాలని గత నెల సెప్టెంబర్లో ఉత్తర్వు లు జారీ అయ్యాయి.ఈ నెల 16 వరకు సగం మంది వివరాలు కూడా పోర్టల్లో నమోదు చేయలేదు. 5.21 లక్షల మంది శాశ్వత ఉద్యోగులకుగాను 2.22 లక్షల మంది వివరాలే నమోదయ్యాయి. ఇక తాత్కాలిక ఉద్యోగుల్లో 4.93 లక్షల మందికిగాను 2.74 లక్షల మంది వివరాలే నమోదు చేశారు. ఏ ఒక శాఖ కూడా వందశాతం ప్రక్రియను పూర్తి చేయలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ శాఖలు, సంస్థ లు, పీఎస్యూలు, యూనివర్సిటీలు, కార్పొరేషన్లు, సొసైటీలు, ఇతర సంస్థల్లో పనిచేసే ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఫుల్టైమ్, పార్ట్టైమ్, దినసరి వేతనాలకు పనిచేసే వివిధ రకాల ఉద్యోగుల పూర్తి వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో నమోదుచేయాలని మరోసారి ఆదేశించారు. కొన్ని కార్యాలయా ల్లో తాతాలిక ఉద్యోగులు మానేసినా, అనధికారికంగా సుదీర్ఘ సెలవులో వెళ్లినా వారి పేర్ల తో వేతనాలు డ్రా చేస్తున్నారనే విమర్శలు ఉ న్నాయి. ఈ క్రమంలో ఉద్యోగుల వివరాలను నమోదు చేయడం ద్వారా ఎంతమంది పనిచేస్తున్నారనే స్పష్టమైన వివరాలు తెలుస్తాయని భావిస్తున్నారు. పోర్టల్లో ఉద్యోగుల వివరాలను నమోదు చేయడం వల్ల వేతనాల చెల్లింపులో పారదర్శకత ఉంటుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.చిరుద్యోగులపై కత్తిప్రభుత్వ శాఖల్లో ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు భారీ సంఖ్యలోనే ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వులపై అవగాహన ఉం డదు. ఇప్పటికే మూడుసార్లు ఆధార్కార్డు అప్డేట్ చేయాలన్నారు. ప్రభుత్వం వద్దే ఔట్సోర్సింగ్ ఏజెన్సీల సమాచారముంటుంది. ఏజెన్సీల ద్వారా అప్డేట్ చేయవచ్చు. లేదా ఆ ఏజెన్సీలను రద్దుచేయవచ్చు. అలా చేయకుం డా ఉద్యోగుల వేతనాలు కట్ చేస్తామనడం అత్యంత దారుణమని ఉద్యోగ సంఘాల నేతలంటున్నారు. చిరుద్యోగుల్లో ఎక్కువగా ము న్సిపాలిటీ, స్థానిక సంస్థల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులే ఉన్నారు. చిరుద్యోగులకు నష్టం జరిగితే ఊరుకోబోమని, వేతనాలు ఆపితే సహిం చే ప్రసక్తే లేదని ఉద్యోగ సంఘాల నేతలంటున్నారు. బోగస్ ఉద్యోగులున్నారని లీకులిస్తున్నారంటే ఇన్నాళ్లు కండ్లుమూసుకున్నారా? అని ప్రశ్నించారు. 20 నెలలుగా వేతనాలెలా ఇచ్చారని నిలదీస్తున్నారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీలను ఎందుకు కట్టడిచేయలేకపోతున్నారని అంటున్నారు. ఇప్పటికే కొన్ని శాఖల్లో ఉద్యోగుల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. మైనా ర్టీ పాఠశాలల్లో మూడు-నాలుగు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమశాఖల్లోనూ ఇదే పరిస్థితి. ఆరోగ్యశాఖలో ఆలస్యంగా వేతనాలందాయి.కార్పొరేషన్ హామీ ఏమైనట్టుఆర్థికశాఖ ద్వారా అందిన సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 4.94లక్షల మంది ఉద్యోగులు ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరిలో 81,341 కాంట్రాక్ట్ ఉద్యోగులు కాగా, మరో 53వేల మంది మల్టీపర్సస్ ఉద్యోగులు. 1.27లక్షల మంది ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తుండగా, డెయిలీవేజెస్, ఎన్ఎంఆర్, ఎంటీఎస్, సెర్ప్లో మరో 13వేల మంది పనిచేస్తున్నారు. గౌరవ భృతి పొందుతున్న వారు 2.18లక్షల మంది ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని తెలిపిం ది. కానీ పీఠమెక్కాక ఈ హామీని విస్మరించిం ది. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు భద్రత, కమీషన్ల దందాకు చెక్ పడుతుంది. గత ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు, కార్పొరేషన్ హామీని బుట్టదాఖలు చేసేందుకే ఆధార్కార్డులను తెరపైకి తెచ్చారని ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేత శ్రీధర్ ఆరోపించారు.హెచ్వోడీలను తీసివేయాలిఇప్పటివరకు ఏయే శాఖల్లో ఐఎంఎఫ్ఐఎస్ పోర్టల్లో ఉద్యోగుల వివరా లు నమోదు చేయలేదో ఆ శాఖ హెచ్వోడీ, ఎండీ, ఉన్నత అధికారులను ఉ ద్యోగంలో నుంచి తీసివేయాలి. ప్రభు త్వ సీఎస్ నుంచి ఆదేశాలు వచ్చినా స్పందించడం లేదంటే.. ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేమీ ఉండదు. మీరు ఎటువంటి తప్పు చేయనపుడు ఎందు కు నమోదు చేయడం లేదు? మీరు గవర్నమెంట్ను ఎంత మోసం చేశా రో? ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి. అధికారుల నిర్లక్ష్యానికి మేము శిక్ష అనుభవించాలా? ఇది ఎకడి న్యాయం? వాళ్లకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనం పడుతున్నది. అందుకే వాళ్లకు మా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బాధ తెలియ దు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీతం కూడా నిలిపివేయాలి. అప్పుడు మా బాధ తెలుస్తుంది. లేనిపక్షంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ పోరాటం చేస్తుంది. -తెలంగాణ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ

## మెట్రోఫేస్-2ని అడ్డుకుంటుంది కిషన్రెడ్డినే.. మహేష్ గౌడ్ షాకింగ్ కామెంట్స్



**ఢిల్లీ, అక్టోబరు26 :** మెట్రో విస్తరణ విషయంలో కేంద్రమంత్రి కిషన్రెడ్డి అడ్డంకిగా ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మెట్రో పనులు చేపట్టేలా ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. ఆయన మెట్రో కోసం ఎందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవడం లేదని నిలదీశారు. మెట్రోఫేస్-2ని అడ్డుకుంటుంది కిషన్రెడ్డినేనని ఆరోపించారు. కిషన్రెడ్డి బాధ్యత తీసుకుని పూర్తి చేయాలని కోరారు మహేష్ కుమార్ గౌడ్.

మెట్రో విస్తరణకి కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. సబర్మతి నిరాశ్రయులకు కేంద్ర న్యాయం చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తాము మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తున్నామని ఉద్ఘాటించారు. మూసీని ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని ఉద్ఘాటించారు. మసిపూసి మారేడుకాయా చేసి మెట్రోఫేస్-2 ప్రాజెక్టు అడ్డుకుంటున్నారని ఫైర్ అయ్యారు మహేష్ కుమార్ గౌడ్.కవిత వాస్తవాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కవిత భాగస్వామిగా ఉన్నారని గుర్తుచేశారు. డిసీసీల నియామకం సమర్ధవంతంగా కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. కొన్ని జిల్లాల్లో డీసీసీ పదవులకు 30 మందికి పైగా అభ్యర్థన పెట్టుకున్నారని తెలిపారు. నిన్న కేసీ వేణుగోపాల్తో సీఎం రేవంత్రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికలు, డీసీసీ ఎంపికపై చర్చించాని చెప్పుకొచ్చారు మహేష్ కుమార్ గౌడ్.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి పద్మావతి రెడ్డి కూడా డీసీసీ పదవికి దరఖాస్తు చేశారనే సమాచారం ఉందని తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫ్యామిలీ 30 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నారని నొక్కిచెప్పారు. కొన్ని చోట్ల సమర్ధవంతులు, అనుభవం ఉన్న వారికి డీసీసీ పదవి ఇవ్వొచ్చని తెలిపారు. ఎమ్మెల్యేలకు కూడా డిసీసీ పదవులు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేల పదవి అనేది డీసీసీ అడ్డంకి కాదని స్పష్టం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఐఏఎస్ అధికారి రిజ్వీ ఎవరైనా ప్రజలకు జవాబు దారులుగా ఉండాలని సూచించారు. హాలోగ్రామ్ టెండర్లు పదేళ్లుగా ఒకే కాంట్రాక్టర్లకు ఎందుకు ఇచ్చారో అధికారి రిజ్వీ సమాధానం చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

## తలలు పగులగొట్టి వృద్ధ దంపతుల దారుణ హత్య




**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి సమీపంలో వృద్ధ జంట దారుణ హత్యకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగప్ప (60), ఓబులమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మరోవైపు ఓబులమ్మ అంగీకారంతో పెద్దక్క (53) తో సుమారు 30 ఏళ్లుగా నాగప్ప సహజీవనం చేస్తున్నాడు.వారు తాడిపత్రి రహదారిలోని పెద్ద పసుపుల మోటులో ఇటుకల బట్టీలు నడుపుతున్నారు. నాగప్ప, పెద్దక్క తాడిపత్రిలో రహదారిలోని ఇటుకల బట్టీ వద్ద నివాసముంటున్నారు. ఓబులమ్మ తన ఇద్దరు కుమారులతో జమ్మలమడుగు పట్టణంలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం నాగప్ప, పెద్దక్క తాడిపత్రి రహదారిలోని ఇటుకల బట్టీలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు రోకలి బండతో వారి తలలు పగలగొట్టి హతమార్చారు.హత్యా జరిగిన ప్రదేశం పక్కనే ఉన్న గదిలోగల బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ హత్యలు డబ్బు

## ముంచుకొస్తున్న తుఫాను, ప్రయాణాలు వద్దు..ఏ ఈ జిల్లాలకు ముప్పు- సెలవులు రద్దు

**అమరావతి:**రాష్ట్రానికి 'మొంథా' తుపాను ముప్పు ముంచుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ దిశగా కదిలి వాయుగుండంగా మారింది. ఉత్తర-వాయవ్య దిశగా ప్రయాణించి 28న ఉదయానికి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రానికి కాకినాడ వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో, ప్రభుత్వం అప్రతమత్తం అయింది. అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఎమర్జెన్సీ సేవల ఉద్యోగుల సెలవులను రద్దు చేసింది.తుఫాను వేళ ప్రభుత్వం అప్రమత్తం అయింది. ప్రజలకు కీలక సూచనలు చేసింది. విద్యుత్ శాఖ తో సహా ఎమర్జెన్సీ సేవల ఉద్యోగుల సెలవులను రద్దు చేసింది. 28వ తేదీ కాకినాడ వద్ద తీరం దాటే వరకు తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అన్ని శాఖల ఉద్యోగులు సమన్వ యంతో వ్యవహరించాలని ప్రభుత్వం సూచించింది.తుఫాను ప్రభావిత జిల్లాల కు ప్రత్యేక అధికారులను నియమించింది. శ్రీకాకుళం జిల్లాకు కేవీఎన్ చక్రధర బాబు, విజయ నగరం జిల్లాకు పి.రవి సుభాష్, మన్యం జిల్లాకు నారాయణ భరత్ గుప్తా, విశాఖపట్నం జిల్లాకు అజయ్ జైన్, అనకాపల్లి, అల్లూరు సీతారామరాజు జిల్లాలకు వాడ్రేవు వినయ్ చంద్, తూర్పు గోదావరి కి కే కన్నబాబు, కాకినాడ జిల్లాకు విఆర్ కృష్ణ తేజ ను నియమించారు.కోనసీమ జిల్లాకు విజయరామరాజు, పశ్చిమగోదావరి జిల్లాకు ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లాకు కాంతిలాల్ దండే, కృష్ణా జిల్లాకు కాటా ఆమ్రపాలి, ఎన్టీఆర్ జిల్లాకు శశి భూషణ్ కుమార్, గుంటూరు జిల్లాకు ఆర్ పి సిసోడియా, బాపట్ల జిల్లాకు ఎం వేణుగోపాల్ రెడ్డి, ప్రకాశం జిల్లా కు కోన శశిధర్, నెల్లూరు జిల్లాకు ఎన్ యువరాజ్, తిరుపతి జిల్లాకు పి అరుణ్ బాబు, చిత్తూరు జిల్లాకు పిఎస్ గిరీషాలను ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది.జిల్లాల్లో సైక్లోన్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కాకినాడ వద్ద తీరం దాటనుండటంతో ఉభయ గోదావరి తో పాటుగా ఉత్తరాంధ్ర, క్రిష్ణా.. గుంటూరు జిల్లాలపైన ఎక్కువగా ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. దీంతో.. మూడు రోజులు ముందస్తుగానే పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే జిల్లాల యాంత్రాంగానికి స్పష్టం చేసింది.



## కస్టమర్ల కష్టాలకు చెక్, బ్యాంకింగ్ సేవల్లో కీలక మార్పులు



**అమరావతి:**బ్యాంకింగ్ సేవల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కస్టమర్ల కష్టాలకు చెక్ పెట్టేలా కొత్త విధానాలు అమల్లోకి వస్తున్నాయి. నామినీ విధానంతో పాటుగా లాకర్ల సమస్యలకు పరిష్కారం చూపుతూ కీలక నిర్ణయాలు జరిగాయి. దీనికి సంబంధించిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం, 2025'ను పార్లమెంట్ ఇప్పటికే ఆమోదించింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ ఏడాది నవంబరు 1 నుంచి బ్యాంకింగ్ చట్టాల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. బ్యాంకుల ఖాతాదారుల సమస్యలకు పరిష్కారం దిశగా కీలక నిర్ణయాలు జరిగాయి. కొత్త బ్యాంకింగ్ చట్టాలు నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. తాజా మార్పుల్లో భాగంగా బ్యాంకు డిపాజిటర్లు ఇక నలుగురి వరకు నామినీలను నామినేట్ చేయవచ్చు. ఈ నలుగురిని ఒకేసారి లేదా ఒకరి తర్వాత ఒకరిని నామినేట్ చేయవచ్చు. ఈ మార్పు వల్ల డిపాజిట్ ఖాతాదారుడికి జరగరాని అనర్థమేదైనా జరిగితే, డిపాజిట్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేలికవుతుంది.అదే విధంగా లాకర్లు, సేఫ్ కస్టడీలోని వస్తువుల విషయం లో నామినేషన్‌కు అవకాశం ఉంటుంది. అంతేకాదు వరుస క్రమం ప్రకారం మాత్రమే నామినీలకు లాకర్లను నిర్వహించే అధికారం ఉంటుంది. ఈ చట్టం ద్వారా ఖాతాదారు తన తదనంతరం తన డిపాజిట్ లేదా లాకర్‌లోని వస్తువుల్లో ఏ నామినీకి ఎంత మొత్తం లేదా ఎంత శాతం చెల్లించాలనే విషయాన్ని ముందుగానే బ్యాంకుకు తెలియజేయవచ్చు.అదే విధంగా బ్యాంకుల్లో డిపాజిట్లు, లాకర్లు, సేఫ్ డిపాజిట్ వాల్ట్‌లు ఉన్న వ్యక్తిగత/జాయింట్ లేదా సోల్ ప్రొప్రైటరీ ఖాతాదారులు అందరూ.. ఇక తమకు నచ్చిన నలుగురిని తమ నామినీలుగా నామినేట్ చేయవచ్చు. ఒకేసారి లేదా వరుస క్రమంలో తమ ప్రాధాన్యత ప్రకారం నామినీలను నామినేట్ చేసే వెసులుబాటు కల్పించారు. కాగా.. కొత్త నిబంధనలతో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరగనుంది.దీంతో క్లెయిమ్‌ల పరిష్కారంలో ఆలస్యం, వివాదాలకు కూడా అవకాశం లేకుండా మార్పులు చేసారు. జాయింట్ ఖాతాదారులు పరస్పర అంగీకారంతో నామినీల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయవచ్చు. దీని వల్ల ఖాతాదారుడు చనిపోయిన సమయంలో క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత తేలికవుతుంది. ఇక నుంచి ఎలక్ట్రానిక్ పద్ధతి లోనే అన్ని అంశాలను అప్డేట్ చేయాల్సి ఉంటుంది.

## ప్రైవేట్ బస్సులను నమ్ముకోకండి బ్రో.. బెంగళూరుకు ప్రత్యేక రైళ్లు ఏపీలో హాల్ట్ స్టేషన్లు



**అమరావతి:**పండగ సీజన్ లో రైళ్లకు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది. వివిధ పుణ్యక్షేత్రాలు, పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి, దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించా లనుకునే వాళ్ల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంటుందీ సీజన్‌లో. వాళ్లంతా కూడా రైళ్ల మీదే ఎక్కువగా ఆధారపడుతుంటారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు పలు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.సికింద్రాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తోన్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు- పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు ఇదివరకే ప్రకటించారు. దీపావళి పండగల సమయంలో ఏర్పడే రద్దీని ఎదుర్కొనడానికి సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోని నడిపిస్తోన్నారు.

## తుఫాను తీవ్రరూపం, కుండపోత వర్షాలు ఈ జిల్లాలకు తాజా హెచ్చరిక

**అమరావతి:** ఏపీకి వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. రానున్న మూడు రోజులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మొంథా తుఫాన్ మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇవాళ సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉంది. కాకినాడ సమీపంలో మచిలీపట్నం-కళింగ పట్నం మధ్య తీవ్రతుపాను తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో.. ప్రభుత్వం అలర్ట్ అయింది. అధికారులను అప్రమత్తం చేసింది. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు. పాఠశాలలకు మూడు రోజులు సెలవులు ప్రకటించారు.మొంథా తుపాను భయపెడుతోంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇదే సమయంలో అటు మచిలీపట్నంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. కాగా, తుపాను తీరందాటే సమయంలో గంటకు 90-110 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి.సోమవారం, మంగళవారం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు.కాగా, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రత్యేక అధికారులను జిల్లాలకు పంపిన ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. తీరప్రాంత ప్రజలను సుర క్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. కాలువలు, చెరువులు, నదులను నిత్యం పర్యవేక్షించాలనినిర్దేశించారు. విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదుకు అధికారులు ప్రత్యేక నంబర్లను ఏర్పాటు చేశారు.ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసు నంబర్ 8331018762, విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదునకు టోల్‌ఫ్రీ నంబర్ 1912, అదే విధంగా అంతరాయంపై ఫిర్యాదునకు వాట్సాప్ నంబర్ 9493916192 లను సంప్రదించవచ్చు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని ప్రజలకు విద్యుత్‌శాఖ హెచ్చరించింది. ఇప్పటికే తుఫాను ప్రభావిత జిల్లాల్లో మూడు రోజులు విద్య సంస్థలకు సెలవు ప్రకటించారు. ఎమర్జెన్సీ సేవల్లోని ఉద్యోగులకు సెలవు రద్దు చేసారు. ప్రభావిత జిల్లాల ప్రజలకు ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ల ద్వారా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.



## తిరుమలలో 250 రోజులకు పైగా.. కీలక ప్రకటన చేసిన టీటీడీ చైర్మన్



**శ్రీకాకుళం :**బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావం వల్ల ఏపీలో భారీ వర్షాలు పడుతున్నాయి. శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం ఈ మధ్యాహ్నానికి నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడింది. ఫలితంగా వచ్చే అయిదు రోజులపాటు రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఈ భారీ వర్షాలు శ్రీవారి భక్తుల చింత తీర్చాయి. తిరుమలలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అయిదుప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని అందుకున్నాయి. జలకళను సంతరించుకున్నాయి. తిరుమలకు పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులు. భారీ వర్షాల వల్ల వరదనీరు జలాశయాల్లోకి చేరుకుంటోంది. ప్రస్తుత నీటి నిల్వలు తిరుమలకు 250 రోజుల మంచినీటి అవసరాలకు సరిపోతాయి.గోగర్భం డ్యామ్ పూర్తిగా నిండిపోవడంతో ఒక గేటును తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తోన్నారు టీటీడీ అధికారులు. రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు పూర్తిస్థాయికి చేరుకోవడంతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక పూజలు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పాపవినాశనం రిజర్వాయర్ వద్ద ఈ ఉదయం గంగ హారతి సమర్పించారు. ఆ సమయంలో ఆయన వెంట టీటీడీలోని వివిధ విభాగాధిపతులు ఉన్నారు.అనంతరం బీఆర్ నాయుడు విలేకరులతో మాట్లాడారు. తిరుమలలోని జలాశయాలు 95 శాతం నిండిపోవడం శుభ పరిణామమని, 250 రోజులకు పైగా భక్తుల నీటి అవసరాలకు తగినంత నీళ్లు రిజర్వాయర్లల్లో వచ్చి చేరాయని చెప్పారు. పాపవినాశనం, గోగర్భం డ్యామ్ లు పూర్తిగా నిండిపోవడంతో గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. భక్తుల అవసరం కోసం తిరుమలలో ప్రతిరోజూ 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుండగా తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ నుండి 25 లక్షల గ్యాలన్లు, తిరుమలలోని డ్యామ్ ల నుండి 25 లక్షల గ్యాలెన్ల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.తిరుమలలో 250 రోజుల నీటి అవసరాలకు సరిపడే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డ్యామ్ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి అవసరాలను సక్రమంగా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ శాఖను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. టీటీడీ చరిత్రలో రికార్డుస్థాయిలో మొదటిసారి ఈ ఏడాది భారీ విరాళాలు అందాయని బీఆర్ నాయుడు అన్నారు. గత 11 నెలల్లో టీటీడీ ట్రస్టులకు రూ.918 కోట్లు విరాళాలు అందినట్లు చెప్పారు.

## టీటీడీ పరకామణి చోరీ కేసు.. హైకోర్టులో కీలక పరిణామం

**తిరుమల:**తిరుమల పరకామణి చోరీ కేసు లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో హైకోర్టు ఆగ్రహంతో సీఐడీ రికార్డులను సీజ్ చేసింది. టీటీడీ కౌంటర్ దాఖలు చేయటం పైన ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం ఈవో కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. కాగా, ఇప్పుడు మాజీ ఏవీఎస్ఓ సతీశ్ కుమార్ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ లో కీలక అంశాల ను ప్రస్తావించారు. చోరీ కేసు రాజీ చేసుకోవటానికి టీటీడీ... బోర్డు అనుమతి అవసరం లేదని చెప్పటం ఆసక్తి కరంగా మారుతోంది.టీటీడీ పరకామణిలో చోటు చేసుకున్న చోరీ కేసు విచారణలో అనేక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా సతీశ్ కుమార్ దాఖలు చేసిన కౌంటర్ లో టీటీడీ పరకామణి విభాగం ఇంఛార్జి అధికారిగా చోరీ కేసులో రాజీ చేసుకునే అధికారం లోక్ అదాలత్ చట్ట ప్రకారం తనకు ఉందని పేర్కొన్నారు. టీటీడీ చట్టం రాష్ట్ర శాసనమని, ఐపీసీ, సీఆర్‌పీసీ కేంద్ర చట్టాలని చెప్పుకొచ్చారు.చోరీ వ్యవహారంపై నమోదు చేసిన సెక్షన్లు రాజీకి అవకాశం ఉన్నవేనని..ఈ కేసును రాజీ చేసుకోవడానికి టీటీడీ బోర్డు తీర్మానాలు అవసరం లేదని స్పష్టం చేసారు. చోరీ ఘటనపై ఫిర్యాదు చేసింది తానేనని, ఫిర్యాదుదారుడు రాజీ చేసుకోవడానికి ఎలాంటి నిషేధం ఉండదని కోర్టుకు వివరించారు. తాను సదుద్దేశంతో కేసు రాజీ చేసుకున్నాని చెప్పారు.పరకామణిలో గుమస్తా సీవీ రవికుమార్ చోరీకి పాల్పడిన ఘటనపై నమోదు చేసిన కేసును లోక్ అదాలత్‌లో రాజీచేసుకోవడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంపై సీఐడీతో దర్యాప్తు చేయించాలని టీటీడీ ఈవోకు ఇచ్చిన వినతిపై చర్యలు లేవంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న ఏవీఎస్‌వో వై సతీష్‌కుమార్ తాజాగా హైకోర్టులో అఫిడవిట్ వేశారు.రవికుమార్ రూ.72వేల విలువ చేసే అమెరికన్ డాలర్లు చోరీ చేస్తూ సీసీ కెమేరాలకు బహిరంగంగా దొరికారని, వాటిని సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది తానేనని ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ పేర్కొన్నారు.సీవీ రవికుమార్ ఈ కేసును రాజీ చేసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నారన్నారు. ఈ వ్యవహారంలో ఫిర్యాదుదారుడిగా తాను రాజీకి ఒప్పుకున్నానని, ఇందులో సదుద్దేశం తప్ప ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. తన ఉన్నతాధికారుల సూచన మేరకు, టీటీడీ, భక్తుల ప్రయోజనాలు కాపాడేందుకు కేసు రాజీకి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో, పిటిషనర్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, వ్యాజ్యాన్ని కొట్టేయాలని కోరారు. సోమవారం ఈ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరపనుంది.




## మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాలకు ప్రత్యేక అధికారులు

**అమరావతి:** మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సీఎస్ విజయానంద్ జీఓఆర్టీ నెంబర్ 1982 జారీ చేసింది. ఈ ప్రత్యేక అధికారులు రిలీఫ్ రిహాబిలిటేషన్ కార్యక్రమాలను తుఫాను ప్రభావంతో వర్షాలు తగ్గేవరకు చేపట్టాలని ఆదేశించారు.శ్రీకాకుళం జిల్లాకు కేవీఎన్ చక్రధర బాబు, విజయనగరం జిల్లాకు పి.రవి సుభాష్, మన్యం జిల్లాకు నారాయణ భరత్ గుప్తా, విశాఖపట్నం జిల్లాకు అజయ్ జైన్, అనకాపల్లి, అల్లూరు సీతారామరాజు జిల్లాలకు వాడ్రేవు వినయ్ చంద్, తూర్పుగోదావరి కి కే కన్నబాబు, కాకినాడ జిల్లాకు విఆర్ కృష్ణ తేజ, కోనసీమ జిల్లాకు విజయరామరాజు, పశ్చిమగోదావరి జిల్లాకు ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లాకు కాంతిలాల్ దండే, కృష్ణా జిల్లాకు కాటా ఆమ్రపాలి, ఎన్టీఆర్ జిల్లాకు శశి భూషణ్ కుమార్, గుంటూరు జిల్లాకు ఆర్ పి సిసోడియా, బాపట్ల జిల్లాకు ఎం వేణుగోపాల్ రెడ్డి, ప్రకాశం జిల్లా కు కోన శశిధర్, నెల్లూరు జిల్లాకు ఎన్ యువరాజ్, తిరుపతి జిల్లాకు పి అరుణ్ బాబు, చిత్తూరు జిల్లాకు పిఎస్ గిరీషాలను ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది.ఉత్తర కోస్తా జిల్లాలు అయిన శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్, ఈస్ట్ గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలకు జోనల్ ఇన్చార్జిగా అజయ్ జైన్‌ను.. దక్షిణ కోస్తా జిల్లాలు వెస్ట్ గోదావరి, ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు జోనల్ ఇన్చార్జిగా ఆర్‌పీ సిసోడియాలను నియమించారు. ఈ అధికారులంతా వారికి కేటాయించిన జిల్లాలకు వెళ్లి ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని సైక్లోన్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసుకోవాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పునరావాస కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. సాధారణ పరిస్థితులు వచ్చేవరకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు నిర్వహించాలని ఆయన వెల్లడించారు.



## ఒక్కరూపాయి ఖర్చు లేకుండా మీ దగ్గరకే వైద్యం.. ఇదే చంద్రబాబు ఆరోగ్య రథం

**అమరావతి:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అందిస్తూనే, ఏపీ వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య రక్షణ పైన కూడా చంద్రబాబు ప్రత్యేకమైన దృష్టిని సారిస్తున్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకాన్ని 25 లక్షలకు పెంపు చేసిన చంద్రబాబు యూనివర్సల్ హెల్త్ పాలసీని అందిస్తున్నారు.ఏపీలో సిద్ధమైన ఆరోగ్య రథంమారుమూల గ్రామీణ ప్రాంతాలలోనూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్న చంద్రబాబు ఇప్పటికే 104 సంచార వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే మరింత సమర్థవంతంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య రథం పేరుతో ఉన్న నమూనా వాహనాలను సిద్ధం చేశారు.47 రకాల వైద్య పరీక్షలతో పాటు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులురాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈ వాహనాల ద్వారా 47 రకాల వైద్య పరీక్షలను నిర్వహించి రోగుల ఆరోగ్య పర్యవేక్షణ కోసం ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు ఆమోదం పొందిన వెంటనే ఈ కొత్త వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.104 మొబైల్ మెడికల్ వాహనాలతో ఈ ఇబ్బందులు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 936 వరకు 104 మొబైల్ మెడికల్ యూనిట్లు పనిచేస్తున్నాయి. అయితే ఇవి తరచూ మరమ్మతులకు రావడంతో ప్రతి వాహనం నెలకు కేవలం రెండుసార్లు మాత్రమే గ్రామాలకు వెళుతున్న పరిస్థితి ఉంది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు .ఈ క్రమంలోనే కొత్త ఆరోగ్య రథాలను తీసుకువచ్చి , వైద్య బృందంతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ లను కూడా పంపి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి చంద్రబాబు సంకల్పించారు. ఈ ఆరోగ్య రథాలు గ్రామంలో ప్రజల వద్దకు నేరుగా వెళ్లి ప్రజల నుండి అవసరమైన నమూనాలను సేకరించి, వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు చేసి ఫలితాలను రోగులకు చేరవేస్తారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి కుప్పంలో ప్రయోగాత్మకంగా అయితే సర్కార్ భావిస్తోంది.



## మణిపూర్‌లో డెంగ్యూ విజృంభన.. 3,300 దాటిన కేసులు





**మణిపూర్:** మణిపూర్‌లో డెంగ్యూ విజృంభిస్తున్నది. అక్టోబర్ 25 నాటికి ఆ రాష్ట్రవ్యాప్తంగా 3,334 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 2,323 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇంఫాల్ తూర్పులో మొత్తం 608 కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో గత 24 గంటల్లో 69 కొత్త కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ తెలిపింది. ఇంఫాల్ వెస్ట్‌లో కొత్తగా 38 కేసులు, ఇంఫాల్ తూర్పులో 21 కొత్త కేసులను గుర్తించినట్లు పేర్కొంది.కాగా, మణిపూర్‌లోని అన్ని జిల్లాల్లో డెంగ్యూ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్‌లో 96, తౌబాల్‌లో 74, సేనాపతిలో 61, కాక్చింగ్ జిల్లాలో 45 డెంగ్యూ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఉఖ్రుల్, చందేల్, తమెంగ్‌లాంగ్, టెంగ్నౌపాల్, కామ్‌జోంగ్, నోనీ, కాంగ్‌పోక్‌పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో 50 కంటే తక్కువ కేసులు ఉన్నాయన్నారు.మరోవైపు జిరిబామ్, ఫెర్జావల్‌లో ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లాలో డెంగ్యూ వల్ల ఒకరు మరణించినట్లు వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు వివరించారు.

## 70 మంది ప్రయాణికులతో వెళ్తూ మంటల్లో చిక్కుకున్న మరో బస్సు



**కర్నూలు** :ఏపీలోని కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మంటల్లో చిక్కుకుని 20 మంది మరణించిన ఘటనను మరువకముందే మరో ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీ నుంచి గోండా కు 70 మంది ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకున్నది.ఆగ్రా-లక్నో జాతీయ రహదారిపై రేవ్రీ టోల్‌ప్లాజాకు 500 మీటర్ల దూరంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ముందుగా ముందు టైర్‌లో చెలరేగిన మంటలు క్రమంగా బస్సు మొత్తం వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్, కండక్టర్ ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు.పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు.

## బైక్ స్టంట్‌లో బీటెక్ విద్యార్థి మృతి.. స్కిడ్ కావడంతో ఎగసిన నిప్పురవ్వలు



**సిమ్లా:** బైక్ స్టంట్ బెడిసికొట్టింది. బైక్ స్కిడ్ కావడంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. స్టంట్ చేసిన బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నాగ్‌చాలాకు చెందిన 22 ఏళ్ల అనికేత్ బిటెక్ విద్యార్థి. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో పాపురల్ అయిన అతడు శనివారం అర్ధరాత్రి వేళ రీల్ కోసం ప్రయత్నించాడు. కిర్తాపూర్-మనాలీ నాలుగు లేన్ల రహదారిలోని మలోరి టన్నెల్ సమీపంలో బైక్‌పై స్టంట్ చేశాడు.కాగా, ఆ స్టంట్ బెడిసికొట్టింది. అనికేత్ బైక్‌పై నియంత్రణ కోల్పోయాడు. టన్నెల్ మలుపు వద్ద రోడ్డుపై బైక్ జారడంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో అనికేత్ మెడ విరిగింది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అనికేత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు.మరోవైపు ఈ ప్రమాదకర స్టంట్‌కు ప్రయత్నించమని అనికేత్‌ను ప్రేరేపించిన వీడియోగ్రాఫర్‌ను ఈ కేసులో నిందితుడిగా పోలీసులు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లు, కెమెరా ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్టంట్‌కు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## దేశంలో ఏకంగా 22 ఫేక్ యూనివర్సిటీలు.. హెచ్చరించిన యూజీసీ




**ఢిల్లీ** :దేశంలో మొత్తం 22 ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయని 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ హెచ్చరించింది. ఢిల్లీలోని కోట్లా ముబారక్‌పూర్‌లోగల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూజీసీ మరోసారి హెచ్చరికలు చేసింది. ఆ యూనివర్సిటీ అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీచేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఏ చట్టాలకు లోబడి ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది.యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది. వీటిల్లో 9 దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నాయి. వాటిలో ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా.. మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీలోని విద్యార్థులను మాయచేసి ఈ విశ్వవిద్యాలయాలు ఆకర్షిస్తున్నాయి.తమ సంస్థలకు పేర్లుపెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ వంటి పదాలు వాడుతున్నారు. ఇక యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ లాంటి పదాలను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఏదైనా సంస్థలో చేరే సమయంలో దాని పేరు సెక్షన్ 2 (ఎఫ్) లేదా 3 కింద యూజీసీ గుర్తించిన జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి.ఇక ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్ఎంసీ వంటి కౌన్సిల్స్ నుంచి ఆయా సంస్థల్లో ఏ కోర్సుల నిర్వహణకు అనుమతులు లభించాయో సరిచూసుకోవాలి.

## రూ.10 కోట్లు ఇవ్వకుంటే మీ కొడుకుని చంపేస్తాం.. బీజేపీ ఎంపీకి బెదిరింపు కాల్



**న్యూఢిల్లీ:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీ, లోక్‌సభలో ఆ పార్టీ చీఫ్ విప్ సంజయ్ జైశ్వాల్ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయి. రూ.10 కోట్ల ఇవ్వకుంటే ఆయన కుమారుడిని చంపేస్తామని అజ్ఞాత వ్యక్తులు బెదిరించినట్టు పోలీసులు తెలిపారు.శుక్రవారం మధ్యాహ్నం కొద్దిపాటి వ్యవధిలోనే తనకు రెండు బెదిరింపు కాల్స్ వచ్చినట్టు సంజయ్ జైశ్వాల్ శనివారంనాడు ఫిర్యాదు చేశారని ఎస్‌డీపీఓ (బెట్టాయ్ టౌన్) వివేక్ దీప్ తెలిపారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాల్ చేసిన వ్యక్తిని ట్రాక్ చేస్తున్నట్టు చెప్పారు. కాల్ చేసిన వ్యక్తికి క్రిమినల్ ముఠాతో సంబంధం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. రాజకీయ వైరం ఉన్నట్టు ఎలాంటి సమాచారం లేదని, అయితే అన్ని కోణాల్లోంచి దర్యాప్తు జరుపుతున్నామని ఆయన తెలిపారు.సంజయ్ జైశ్వాల్ బిహార్‌లోని పశ్చిమ చంపరాన్ నియోజకవర్గానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిహార్ బీజేపీ చీఫ్‌గా కూడా ఆయన సేవలందించారు.

## కాంకేర్ జిల్లాలో మరో 21 మంది మావోయిస్టుల లొంగుబాటు




మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ తగులుతున్నది. ఇటీవల పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో 21 మంది మావోలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. బస్తర్ రేంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లొంగిపోయిన మావోయిస్టులు కేశ్‌కాల్ డివిజన్ కుమారి, కిస్కోడా ఏరియా కమిటీ మావోయిస్టులని.. లొంగిపోయిన వారిలో కేశ్‌కాల్ డివిజన్ కమిటీ కార్యదర్శి ముకేశ్, నలుగురు డీవీసీఎంలు (డివిజన్ వైస్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ఏఎంసీ (ఏరియా కమిటీ సభ్యులు)లతో పాటు ఎనిమిది మంది పార్టీ సభ్యులు ఉన్నారని పోలీసు అధికారులు తెలిపారు. బస్తర్‌రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీ సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. మావోయిస్టులు తాము అనుసరిస్తున్న మార్గం వ్యర్థమని భావించి.. వారి జీవితాలను పునర్నిర్మించుకునేందుకు జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని ఎంచుకున్నారన్నారు. ఆయుధాలను విడిచిపెట్టిన 21 మందిలో 13 మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారన్నారు. వారంతా సాయుధ పోరాటాన్ని వీడి శాంతి, పురోగతి మార్గంలో వెళ్లాలనుకుం టున్నారని పోలీస్ అధికారి పేర్కొన్నారు.లొంగుబాటు సమయంలో మావోయిస్టులు 18 ఆయుధాలను అప్పగించారు. ఇందులో మూడు ఒకే 47 రైఫిల్స్, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, రెండు ఇన్సాస్ రైఫిల్స్, ఆరు 303 రైఫిల్స్, రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, ఓ బీజీఎల్ (బారెల్ గ్రెనేడ్ లాంచర్) ఉన్నాయి. చట్టప్రకారం పునరావసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. లొంగుబాటు, పునరావాసానికి సంబంధించిన వివరాలన్నీ త్వరలోనే వివరిస్తామని ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల పెద్ద సంఖ్యలో మావోయిస్టులు అడవి మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. అక్టోబర్ మూడో వారంలో దాదాపు 238 మంది మావోయిస్టులు లొంగిపోచారు. 17న బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయం జగదల్‌పూర్‌లో అధికారుల ముందు లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడితో సహా దాదాపు 210 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసింది. రూ.9.18 కోట్ల రివార్డును ప్రకటించారు. లొంగిపోయిన సీనియర్ నేతల్లో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్ అలియాస్ సతీశ్, భాస్కర్ అలియాస్ రాజ్‌మన్ మాండవి, రాణిత, రాజు సలాం, ధన్ను వెట్టి, అలియాస్ సంతు, నలుగురు సభ్యులు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ప్రాంతీయ కమిటీ సభ్యుడు రతన్ ఎలామ్ ఉన్నారు.

## ముప్పు నుంచి తప్పించుకునేందుకు వ్యక్తి యత్నం.. మట్టిచరియలు విరిగిపడటంతో మృతి



**తిరువనంతపురం:** మట్టిచరియలు విరిగిపడే ముప్పు నుంచి తప్పించుకునేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. మరికొందరితోపాటు ఇళ్లను వీడి శిబిరానికి చేరుకున్నాడు. అయితే రాత్రి వేళ భార్యతో కలిసి ఇంటికి తిరిగి వెళ్లాడు. మట్టిచరియలు విరిగిపడటంతో అతడు మరణించాడు. కేరళలోని ఇడుక్కి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదిమలిలోని మన్నంకండంలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ హైవే కింద ఉన్న కొండ వాలులో ఒక నివాస కాలనీ ఉన్నది. తవ్వకాల వల్ల మట్టిచరియలు విరిగిపడే అవకాశం ఉండటంతో శనివారం సాయంత్రం 22 కుటుంబాలను ఆదిమలిలోని స్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరానికి తరలించారు.కాగా, 48 ఏళ్ల బీజు కూడా తన ఇంటిని వీడి భార్య సంధ్యతో కలిసి ఆ శిబిరానికి వెళ్లాడు. అయితే అతడు భార్యతో కలిసి రాత్రి వేళ ఇంటికి తిరిగి వచ్చాడు. వారు ఆహారం వండుకున్నారు. రాత్రి 10.30 గంటల సమయంలో మట్టిచరియలు విరిగిపడ్డాయి. దీంతో బీజు ఇంటితో పాటు మరో ఎనిమిది ఇళ్లలు ధ్వంసమయ్యాయి.మరోవైపు ఇది తెలుసుకున్న స్థానికులు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఇంటి శిథిలాల కింద చిక్కుకున్న బీజు, అతడి భార్య సంధ్యను రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేట్టారు. ఐదు గంటలు శ్రమించిన తర్వాత వారిని బయటకు తీశారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బీజు మరణించాడు. అతడి భార్యను అలువాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.కాగా, రహదారి విస్తరణ కోసం ఎలాంటి భద్రతా జాగ్రత్తలు లేకుండా మట్టిని తొలగిస్తున్నారని బాధిత కుటుంబంతోపాటు ఇండ్లు ధ్వంసమైన స్థానికులు ఆరోపించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కొండ వాలును తొలగిస్తున్నారని విమర్శించారు. ఇండ్లు కోల్పోయిన తమకు ప్రభుత్వం పునరావాస చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## మీ అమ్మ మనతో కలిసి ఉండటానికి వీల్లేదు.. భార్య వేధింపులతో భర్త ఆత్మహత్య



**న్యూఢిల్లీ** : మీ అమ్మ మనతో కలిసి ఉండటానికి వీల్లేదు అని భార్య వేధింపులకు గురి చేసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హర్యానాలోని ఫరీదాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన యోగేశ్ కుమార్‌కు నేహా రావత్ అనే మహిళతో తొమ్మిదేండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరేళ్ల పాప ఉంది. యోగేశ్ కుమార్ వృత్తిరీత్యా రేడియోథెరపిస్ట్. కాగా గురుగ్రామ్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. నేహా రావత్ ప్రయివేటు ఉద్యోగి.ఇక పెళ్లైనప్పటి నుంచి ఈ దంపతులిద్దరూ నోయిడాలో నివాసం ఉంటున్నారు. అయితే ఇద్దరూ ఉద్యోగస్తులు కావడంతో.. బిడ్డ ఆలనాపాలనా చూసుకనేందుకు యోగేశ్ తన తల్లిని నోయిడాకు పిలిపించాడు. ఆమె రావడం నేహా రావత్‌కు ఇష్టం లేదు. దీంతో దంపతుల మధ్య వివాదాలు మొదలయ్యాయి.ఈ క్రమంలో ఆరు నెలల క్రితం యోగేశ్ ఫరీదాబాద్‌లోని సెక్టార్ 87లోని పియరల్ సొసైటీకి తన బిడ్డతో కలిసి షిఫ్ట్ అయ్యాడు. నోయిడా నుంచి నేహా వచ్చేందుకు అంగీకరించలేదు. మళ్లీ తన బిడ్డ కోసం తల్లిని పిలిపించాడు. ఇక నెల రోజుల క్రితం నేహానే.. యోగేశ్ నివాసం ఉంటున్న పియరల్ సొసైటీకి వచ్చింది. తమ వద్ద మీ అమ్మ ఉండటానికి వీల్లేదు.. గ్వాలియర్ పంపించేయ్.. అప్పుడే నీతో ఉంటాను అని తెగేసి చెప్పింది నేహా.గురువారం నాడు తన భార్యతో కలిసి యోగేశ్ గ్వాలియర్ వెళ్లాడు. తిరిగి ఫరీదాబాద్ చేరుకునే క్రమంలో భార్యను నోయిడాలో వదిలిపెట్టాడు. యోగేశ్ ఒక్కడే పియరల్ సొసైటీకి చేరుకున్నాడు. తాను నివాసం ఉంటున్న 15వ అంతస్తు నుంచి దూకి యోగేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.యోగేశ్ బంధువు ప్రకాశ్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేహా రావత్‌తో పాటు ఆమె తల్లిదండ్రులు శాంతి రావత్, వీర్ సింగ్ రావత్, సోదరులు అశిష్ రావత్, అమిత్ రావత్ వేధింపుల వల్లే యోగేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని ప్రకాశ్ సింగ్ తన పేర్కొన్నాడు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్టు టీ2 టర్మినల్ నుంచి ఎయిర్ ఇండియా డొమెస్టిక్ ఫ్లైట్‌ల రాకపోకలు




**ఢిల్లీ** : ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో టర్మినల్ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్ ఇండియా కీలక ప్రకటన చేసింది. తన టర్మినల్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు జరిగినట్టు తెలిపింది. ఎయిర్ ఇండియాకు చెందిన 60 డొమెస్టిక్ ఫ్లైట్స్ రాకపోకలు మూడవ టర్మినల్‌కు బదులు రెండవ టర్మినల్ నుంచి జరుగుతాయని తెలిపింది. విగతా డొమెస్టిక్ ఫ్లైట్స్ యథావిధిగా టర్మినల్-3 నుంచి రాకపోకలు నిర్వహిస్తాయని పేర్కొంది. ఇక ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ ఎప్పటిలాగే మూడవ టర్మినల్ నుంచి బయలుదేరతాయి. మూడో టర్మినల్ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల సౌలభ్యం కోసం ఎయిర్ ఇండియా ఈ మార్పులు చేసింది. టర్మినల్స్ మధ్య రాకపోకల కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.ఎయిర్ ఇండియా ప్రకటన ప్రకారం, ఒకటితో మొదలయ్యే(ఉదాహరణకు నెంబర్లు ఉన్న డొమెస్టిక్ ఫ్లైట్స్ రాకపోకలు టర్మినల్-2 నుంచి జరుగుతాయి. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి బగ్గీ రైడ్స్ కూడా అందుబాటులో ఉంటాయి. ఇక నిర్వహణ పనుల కారణంగా రెండవ టర్మినల్‌లో తాత్కాలికంగా నిలిచిపోయిన కార్యకలాపాలు నేటి నుంచి మొదలయ్యాయి. దీంతో, అన్ని టర్మినల్స్ అందుబాటులోకి వచ్చినట్లైంది. ఈ మేరకు ఫ్లైట్ నెంబర్స్ ప్లాన్‌లో కూడా మార్పులు జరిగాయి. ముఖ్యంగా ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు మరింత సరళతరం చేసేందుకు, ప్రయాణికులకు జర్నీలు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ మార్పులు చేస్తున్నారు.

## పడక సుఖం కోసం పాపం.. స్తంభానికి కట్టి కర్రలతో కొట్టి చంపేశారు




**కర్ణాటక** :వివాహేతర సంబంధం అనుమానంతో మహారాష్ట్రకు చెందిన 27 ఏళ్ల వ్యక్తిని కర్ణాటకలోని బీదర్ జిల్లాలో కొట్టి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివాహేతర సంబంధం అనుమానంతో జరిగిన దారుణ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మహారాష్ట్రకు చెందిన 27 ఏళ్ల యువకుడిని స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టి చంపారు. ఈ దాడికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు వేగంగా స్పందించి నిందితులను అరెస్టు చేశారు.తాగి బండి నడిపేవాళ్లు.. ఉగ్రవాదులు, మానవబాంబులు: డ్రంకన్ డ్రైవ్ లో దొరికారో..మరణించిన యువకుడిని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గౌనగావ్ గ్రామానికి చెందిన విషు (%ఎఱంష్త్రబ%)గా గుర్తించారు. విషును కొట్టిన నిందితులు, అతనికి వివాహేతర సంబంధం ఉన్న మహిళ పూజ కుటుంబ సభ్యులు కావడం గమనార్హం. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.కర్ణాటకలోని బీదర్ జిల్లాలోని చింతకి పోలీస్ స్టేషన్‌లో దాఖలైన ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఓ వ్యక్తిని స్తంభానికి కట్టేసి కొడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నప్పుడు విషు అనేక గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతన్ని మొదట చింతకి ప్రభుత్వ ఆసుపత్రికి ఆ తర్వాత బీదర్ %దీ=×మీ% ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో విషు తల్లి లక్ష్మి మాట్లాడుతూ.. తన కుమారుడు దాదాపు ఒక సంవత్సరం పాటు పూజ అనే వివాహిత, పిల్లలు ఉన్న మహిళతో సంబంధంలో ఉన్నాడని తెలిపింది. పూజ తన భర్తను విడిచిపెట్టి విషుతో కలిసి జీవించడానికి వచ్చిందని, ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులకు కూడా తెలుసని లక్ష్మి పేర్కొంది. అయితే మూడు నెలల క్రితం పూజ తన తల్లిదండ్రుల ఇంటికి తిరిగి వెళ్లి, నాగనపల్లిలో ఉంటోంది.లక్ష్మి చెప్పిన వివరాల ప్రకారం.. మంగళవారం తన కుమారుడు పూజను కలవడానికి ఇద్దరు స్నేహితులతో కలిసి నాగనపల్లికి వెళ్లాడు. అక్కడ హనుమాన్ దేవాలయం వద్ద ఉన్నప్పుడు పూజ తండ్రి అశోక్, సోదరుడు గజానన్ విషును అడ్డుకున్నారు. పూజతో సంబంధం పెట్టుకున్నందుకు అతన్ని నిలదీశారు. అనంతరం ఆలయం వెలుపలికి లాక్కెళ్లి, కర్రలతో దాడి చేశారు.

ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వీడియోలో విషును స్తంభానికి కట్టేసి, అశోక్, గజానన్ కర్రలతో కొడుతుండగా, అతను సహాయం కోసం ఏడుస్తున్నట్లు కనిపిస్తుంది. లక్ష్మి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా, చింతకి పోలీసులు మొదట భారతీయ న్యాయ సంహిత (%దీచీ%)లోని సెక్షన్లు 109, 118(1), 352, 127(2) కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేశారు.

# రక్తప్రసరణ సాఫీగా సాగాలంటే..!



నడవటం,పరిగెత్తటం లాంటివి రోజూ చేయటం మంచిదే.వ్యాయామాలు చేస్తే శారీరక ఆరోగ్యం కలుగుతుంది. అయితే
యోగాసనాలు వేయటం వల్ల శరీరం స్ట్రెచ్ అయినట్లు అనిపిస్తుంది. ప్రతిరోజూ యోగాసనాలు వేయటం అలవాటు చేసుకుంటే శరీరంలో ఫ్లెక్సిబిలిటీ వస్తుంది. రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. తద్వారా గుండెకు మంచిది.
శరీరం యాక్టివ్‌గా ఉంటుంది.రోజంతా చురుగ్గా ఉంటారు.ముఖ్యంగా ఫేస్‌లో కాంతి కనిపిస్తుంది.
శరీరానికి మంచి ఫిట్‌నెసను ఇస్తుంది యోగా. శరీరం బ్యాలన్స్ అవ్వటం వల్ల కండరాలు మరింతగా గట్టిపడతాయి.
యోగాసనాలు వేయటం వల్ల ఏకాగ్రత కలుగుతుంది.తలనొప్పులు,వెన్నెముకలాంటి సమస్యలు తగ్గిపోతాయి. నిద్రలేమి లాంటి సమస్యలతో బాధపడేవాళ్లకు యోగా అద్భుతమైన ఔషధంలా పని చేస్తుంది. సాఫీగా నిద్ర కలుగుతుంది. ముఖ్యంగా మానసిక ఒత్తిడి తగ్గిపోతుంది. డిప్రెషన్ మూడ్ పోతుంది.మెంటల్‌గా స్ట్రాంగ్ కావటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
యోగా చేసేవారి వయసు కూడా కనపడదు. యంగ్ లుక్‌లో ఉంటారు.దీని వల్ల మరింత ఆనందం కలుగుతుంది. జీవనకాలం పెరుగుతుంది.
యోగాసనాలు వేయటం వల్ల ఎముకల్లో గటదనం వస్తుంది. జీవక్రియ సాఫీగా జరుగుతుంది.ముఖ్యంగా మహిళ శారీరక,మానసిక సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. వ్యాధినిరోధక శక్తి కూడా కలుగుతుంది.
నిపుణుల పర్యవేక్షణలో యోగా చేయటం ఉత్తమం. అప్పుడే మంచి ఫలితాలొస్తాయి.

# శివాలయంలో నంది ఎందుకంత స్పెషల్?
## నందీశ్వరుని విశిష్టత ఏంటో మీకు తెలుసా!



శివాలయంలోకి ప్రవేశించగానే పరమేశ్వరుని కంటే ముందుగా నందిని దర్శించుకుంటారు. నంది రెండు కొమ్ముల మధ్య నుంచి పరమేశ్వరుని దర్శించడం, నందీశ్వరుని చెవిలో తమ అభీష్టాలని చెప్పుకోవడం సర్వసాధారణంగా అందరూ చేస్తూ ఉంటారు.అసలు నందీశ్వరునికి ఎందుకంత ప్రత్యేకత నంది పరమేశ్వరునికి ద్వారపాలకుడు కాబట్టే ఆయనకి అంత ప్రాముఖ్యతా? ఈ సందర్భంగా ఈ కథనంలో నందీశ్వరుని ప్రాముఖ్యతను తెలుసుకుందాం.

**శిలాదుని వృత్తాంతం**
పూర్వం శిలాదుడనే ఋషి ఉండేవారు. ఆయన ఎంత జ్ఞానాన్ని సాధించినా, ఎంతటి గౌరవాన్ని సంపాదించినా, పిల్లలు లేకపోవడం ఆయనకు పెద్ద లోటుగా ఉండేది. ఎలాగైనా సరే తనకు సంతాన భాగ్యం కలిగేందుకు పరమశివుని కోసం తపస్సు చేయసాగాడు శిలాదుడు.

**శిలాదుని కఠోర తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమైన శివుడు**
ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి. ఋతువులు మారుతున్నాయి కానీ శిలాదుని తపస్సు మాత్రం ఆగలేదు. ఒంటినిండా చెదలు పట్టినా సరే ఆయన నిష్ఠ తగ్గలేదు. ఎట్టకేలకు శిలాదుని తపస్సుకు మెచ్చి అతని ఎదుట ప్రత్యక్షం అయ్యాడు పరమశివుడు.

**అసాధ్యమైన వరం కోరిన శిలాదుడు**
తన ఎదుట ప్రత్యక్షమైన పరమశివుని చూసి శిలాదుడు తనకు అయోనిజుడయిన కుమారుడు కలగాలని కోరుకోగా, అతని భక్తికి పరవశించిన పరమేశ్వరుడు 'తథాస్తు' అంటూ వరాన్ని అనుగ్రహించాడు.

**హోమాగ్ని నుంచి ఉద్భవించిన బాలుడు**
శివానుగ్రహంతో వరాన్ని పొందిన శిలాదుడు ఒకనాడు యజ్ఞాన్ని నిర్వహిస్తుండగా, ఆ అగ్ని నుంచి ఒక బాలుడు ఉద్భవించాడు. శిలాదుడు ఆ బాలుడికి 'నందిట అని పేరు పెట్టి అల్లారు ముద్దుగా పెంచుకోసాగాడు.'నంది' అంటే సంతోషాన్ని కలిగించేవాడని అర్థమట! అయోనిజుడుగా జన్మించిన ఆ బాలుని మేథ కూడా అసాధారణంగా ఉండేది. పసిప్రాయంలోనే సకలవేదాలన్నీ ఔపోసన పట్టేశాడు.

**నంది అల్పాయుష్కుడా?**
ఒకరోజు శిలాదుని ఆశ్రమానికి మిత్రావరుణులు అనే దేవతలు వచ్చారు. ఆశ్రమంలో తిరుగుతున్న పిల్లవాడిని చూసి మురిసిపోయారు. అతను తమకి చేసిన అతిథి సత్కారాలకు పరవశించిపోయారు.వెళ్తూ వెళ్తూ 'దీర్ఘాయుష్మాన్ భవ' అని అశీర్వదించబోయి ఒక్క నిమిషం ఆగిపోయారు.

**హతాశుడైన శిలాదుడు**
నంది వంక దీక్షగా చూసి మిత్రావరుణులు ఎందుకలా బాధలో మునిగిపోయారో శిలాదునికి అర్థం కాలేదు. ఎంతగానో ప్రాథేయపడిన తరువాత నంది ఆయుష్షు త్వరలోనే తీరిపోనుందని తెలుసుకున్నాడు శిలాదుడు. భవిష్యత్తు గురించి తెలుసుకున్న శిలాదుడు విచారంలో మునిగిపోయాడు.

**పరమశివుని కోసం నందీశ్వరుని తపస్సు**
నంది అల్పాయుష్కుడని తెలిసి శిలాదుడు బెంగపడ్డా, నంది మాత్రం తొణకలేదు, బెణకలేదు. శివుని అనుగ్రహంతో పుట్టినవాడిని కాబట్టి, దీనికి మార్గం కూడా ఆయనే చూపిస్తాడని అంటూ శివుని కోసం తపస్సు చేయడం మొదలుపెట్టాడు నంది.

**నందికి శివదర్శనం**
నంది తపస్సుకి మెచ్చిన శివుడు అచిరకాలంలోనే అతనికి ప్రత్యక్షమయ్యాడు. శివయ్యని చూసిన నందికి నోట మాట రాలేదు. ఆయన పాదాల చెంత ఉండే అదృష్టం లభిస్తే ఎంత బాగుండో కదా అనుకున్నాడు. అందుకే తన ఆయుష్షు గురించో, ఐశ్వర్యం గురించో వరం కోరుకోకుండా 'ఎల్లప్పుడూ నీ చెంతనే ఉండే భాగ్యాన్ని ప్రసాదించు స్వామీ' అని శివుని వేడుకున్నాడు నంది. అలాంటి భక్తుడు తన చెంతనుంటే శివునికి కూడా సంతోషమే కదా! అందుకే నందిని వృషభరూపంలో తన వాహనంగా ఉండిపొమ్మంటూ అనుగ్రహించాడు.

**శివుని ద్వారపాలకునిగా**
ఆనాటి నుంచి శివుని ద్వారపాలకునిగా ఆయనను కాచుకుని ఉంటూ, ఆయన ప్రమథగణాలలో ముఖ్యునిగా కైలాసానికి రక్షణను అందిస్తూ,తన జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు నంది.

**శివ గాథలలో నంది ప్రస్తావన**
శివునికి సంబంధించిన చాలా గాథలలో నంది ప్రసక్తి ఉంటుంది. వాటిలో శివుని పట్ల నందికి ఉన్న స్వామి భక్తి, దీక్ష కనిపిస్తూ ఉంటాయి. క్షీరసాగర మథనంలో హాలాహలం వెలువడినప్పుడు, దాని నుంచి లోకాలను కాపాడేందుకు శివుడు ఆ విషాన్ని మింగి గరళకంఠునిగా మారాడు. ఆ సమయంలో కొద్దిపాటి విషం కిందకి ఒలికిందట. అప్పుడు శివుని చెంతనే ఉన్న నంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ కాస్త విషాన్నీ ఆరగించేశాడు. మహామహా దేవతలే హాలాహలానికి భయపడి పారిపోతుండగా, నంది మాత్రం కేవలం శివుని మీద ఉన్న నమ్మకంతో దాన్ని చప్పరించేసి నిశ్చింతగా కూర్చున్నాడు.

**అష్టసిద్ధులు సొంతం**
నంది వెనుక ఇంత చరిత్ర ఉంది కాబట్టే, ఆయనను శివునికి సేవకునిగానే కాకుండా ముఖ్య భక్తునిగా కూడా భావిస్తారు పెద్దలు. తమిళనాట ఆయనను అష్టసిద్ధులు కలిగినవానిగా,జ్ఞానిగా,ప్రథమగురువులో ఒకనిగా భావిస్తారు.శైవమత ప్రభావం అధికంగా ఉన్న కర్ణాటకలోని బసవనగుడి, మైసూర్ వంటి ప్రదేశాలలో నందికి ప్రత్యేకించిన ఆలయాలు ఉన్నాయి. ఇక తెలుగునాట కూడా లేపాక్షి, మహానంది వంటి క్షేత్రాల్లో నందీశ్వరునికి ఉన్న ప్రాధాన్యతను చూడవచ్చు. శివుడు ఉన్నంత కాలం ఆయన భక్తుడైన బసవన్నకి కూడా ఏ లోటూ ఉండదు. అందుకే శివాలయాల్లో నందికి ఇంతటి ప్రాముఖ్యత! – ఓం నమఃశివాయ!

# ఫారిన్ స్టడీస్ కోసం ఇన్‌స్టంట్ లోన్ కావాలా?
## ఇలా చేస్తే రుణాలు పొందటం ఈజీ!



స్టూడెంట్స్ ఇన్‌స్టంట్ లోన్ పొందటం అంత ఈజీ కాదు. ఎందుకంటే వారికి ఇన్‌కమ్ కానీ, ఇన్‌కమ్ సోర్స్‌లు కానీ ఉండవు. సాధారణంగా విద్యార్థులు తమ ఉన్నత విద్య, విదేశీ విద్య కోసం రుణాలకు దరఖాస్తు చేస్తుంటారు. అయితే కొన్నిసార్లు ఆదాయం లేకపోవడం అనేది వారికి పెద్ద ఆటంకంగా మారుతుంది. స్టూడెంట్ లోన్ ఈజీగానే మంజూరయ్యే అవకా శాలు ఉన్నప్పటికీ, అది అన్ని రకాల ఖర్చులను కవర్ చేయదు. దీనివల్ల విద్యార్థులు ఇన్‌స్టంట్ రుణం కోసం ప్రయత్నించాల్సి వస్తుంటుంది. పలు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ తరహా ఇన్‌స్టంట్ లోన్స్ ఇస్తుంటాయి.అవసరమైన ప్పుడే రుణ నిధులను వినియోగించుకునేలా వెసులుబాటును సైతం కల్పిస్తాయి. దీనికితోడు ప్రభుత్వం కూడా పలు పథకాల ద్వారా విద్యార్థులకు ఆర్థిక చేదోడును అందిస్తుంది.

**సులభతర దరఖాస్తు**
విద్యార్థుల ఇన్‌స్టంట్ లోన్స్‌కు సులభంగా దరఖాస్తు చేయొచ్చు.వ్యక్తిగత సమాచారాన్ని అందించి కేవైసీ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలి. ఈఎంఐ రూపంలో రుణాన్ని తిరిగి చెల్లించొచ్చు. ఈ రుణాలకు వార్షిక వడ్డీ రేటు కనిష్ఠంగా 10.5 శాతం వరకు ఉంటుంది.

**విద్యార్థులకు బ్యాంకుల రుణాలు**
యాక్సిస్,హెచ్‌డీఎఫ్‌సీ,ఎస్‌బీఐ,ఐసీఐసీఐ వంటి ప్రధాన బ్యాంకులు విద్యార్థులకు ఇన్‌స్టంట్ రుణాలను ఇస్తుంటాయి.విద్యార్థులకు ఆదాయం ఉండదు కాబట్టి,వారు ఎవరైనా ఆదాయపరులు లేదా ఆస్తిపరుల పూచీకత్తుతో బ్యాంకుల్లో రుణాన్ని పొందొచ్చు. దీనివల్ల ఈ లోన్ రిస్క్ స్థాయి తగ్గుతుంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల కంటే తక్కువ వడ్డీరేటునే విద్యార్థుల రుణాలపై వసూలు చేస్తారు. కొన్ని బ్యాంకులైతే విద్యార్థులకు రుణం మంజూరు చేశాక గ్రేస్ పీరియడ్ ఇస్తాయి.ఉద్యోగం వచ్చాకే రుణాన్ని తిరిగి చెల్లించే అవకాశాన్ని కల్పిస్తాయి. సగటున ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వరకు రీపేమెంట్ గడువును ఇస్తాయి.

**ఫిన్‌టెక్ యాప్‌లు**
పలు ఫిన్‌టెక్ కంపెనీలు తక్కువ వడ్డీరేట్లు, తక్కువ డాక్యుమెంటేషన్‌తో విద్యార్థులకు ఇన్‌స్టంట్ రుణాలను మంజూరు చేస్తాయి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నేరుగా మొబైల్ యాప్ నుంచే సమర్పించొచ్చు. అవసరాన్ని బట్టి రూ.10వేల నుంచి రూ.5 లక్షల దాకా రుణం పొందొచ్చు. వ్యక్తిగత వివరాలు, ఆధార్, పాన్, ఆదాయ ధ్రువపత్రాలను ఇవ్వాలి. అయితే ఈ రుణాలను స్వల్ప కాల వ్యవధి కోసమే ఇస్తారు. ఆలస్యంగా రుణ ఈఎంఐలు చెల్లిస్తే భారీగా జరిమానాలు వడ్డిస్తారు. ఫలితంగా క్రెడిట్ స్కోర్ కూడా తగ్గుతుంది.

**పీర్ టు పీర్ రుణ సంస్థలు**
దరఖాస్తుదారుడి అవసరం, ఆర్థిక స్థితి ఆధారం గా పీ2పీ రుణ సంస్థలు లోన్లు మంజూరు చేస్తాయి. ప్రత్యేకించి విద్యార్థుల కు ఇచ్చే రుణాలపై ఎక్కువ వడ్డీని వసూలు చేస్తాయి. ఎందుకంటే వారికి నిర్దిష్ట ఆదాయం ఉండదు. రుణ మొత్తం కూడా తక్కువగా ఉంటుంది.

**ప్రభుత్వ రుణ పథకాలు**
విద్యార్థులకు రుణాల మంజూరుకు భారత ప్రభుత్వం పలు ప్రత్యేక పథకాలను అమలు చేస్తుంటుంది. వీటి ద్వారా విద్యార్థుల రుణాలకు కేంద్ర ప్రభుత్వం పూచీకత్తు లభిస్తుంది. తద్వారా మరే షరతులు లేకుండా గరిష్ఠంగా రూ.7.50 లక్షల వరకు ఇన్‌స్టంట్ లోన్‌ను విద్యార్థులు పొందొచ్చు. ప్రతిభావంతులైన విద్యార్థులకు సాయం చేసేందుకు 'పీఎం – విద్యాలక్ష్మి' పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని ద్వారా పూర్తిగా డిజిటల్ ప్రాసెస్‌తో విద్యార్థులు రూ.10 లక్షల వరకు రుణం పొందొచ్చు. వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్నవారే దీనికి అర్హులు. వార్షిక వడ్డీ రేటు దాదాపు 8.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

# టిప్పు సుల్తాన్ మనసు మార్చిన 'మధురంతేశ్వర' గణేశుడు!
## ఒక్కసారి దర్శిస్తే చాలు పెళ్లి పక్కా!



హిందూ సంప్రదాయం ప్రకారం వినాయకుని పూజించకుండా ఏ పనిని మొదలు పెట్టరు. విఘ్నాలను పోగొట్టే వినాయకుని ఆలయాలు దేశవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. స్వయంభువుగా గణపతి కొలువైన మధురంతేశ్వర సిద్ధి వినాయకుని ఆలయ విశేషాలను ఈ కథనంలో తెలుసుకుందాం.

**రోజురోజుకు పెరిగే మధురంతేశ్వర సిద్ధి వినాయకుడు**
వినాయకుని విశిష్ట ఆలయాల్లో కేరళ కాసర్‌గోడ్ జిల్లా మద్దూర్‌లోని మధురంతేశ్వర సిద్ధి వినాయక ఆలయం ఒకటి. మధుర వాహిని నదీతీరంలో ప్రకృతి రమణీయత మధ్య కొలువు దీరిన ఈ గణపతి దర్శనానికి దేశం నలుమూలల నుంచి భక్తులు బారులు తీరుతారు.ఈ ఆలయంలో గణపతి రోజురోజుకు పెరుగుతాడని అంటారు. ఒకానొక సమయంలో ఆలయంలోని గర్భగుడి దక్షిణ గోడపై ఒక బాలుడు గణపతి చిత్రాన్ని గీశాడు. రోజురోజుకూ ఆ చిత్రం పెరుగుతూ ఉండడం వల్ల ఈ గణపతిని "బొడ్డజ్జ" లేదా "బొడ్డ గణేశుడు" అని వ్యవహరిస్తారు.

**పరమశివుడు ప్రధాన దైవం**
మధురు ఆలయంలో ప్రధాన దైవం పరమశివుడు.ఈ ఆలయంలో కొలువైన వినాయకుడు మధురంతేశ్వర స్వామిగా పూజలందుకుంటాడు గర్భగుడిలో గజముఖుని ప్రక్కనే జగన్మాత పార్వతీదేవి కూడా కొలువై కుమారుడితో సమానంగా నిత్య పూజలు అభిషేకాలు అందుకుంటుంది.

**మిగిలిన వాటికంటే భిన్నంగా**
మద్దూరు మహాగణపతి ఆలయం మిగతా ఆలయాలు కంటే భిన్నంగా కనిపిస్తుంది మూడు చుట్టులుగా ఉన్న ప్రాకారం రూపంలో నెలకొన్న ఈ ఆలయం ఏనుగు వెనక భాగం వలే ఉంటుంది.

**ఆలయ స్థల పురాణం**
ఒక్క నొక్కప్పుడు మధురవాహిని నదీతీరంలో మధురు అనే మహిళ నీటి కోసం వెళ్లినప్పుడు గణపతి ఆమె ఎదుట సాక్షాత్కరించి అక్కడే విగ్రహంగా మారిపోతాడు. వెంటనే ఆ మహిళ ఆ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేసి వారి సహాయంతో స్వామి మూర్తిని నది ఒడ్డునే ఉన్న శివాలయం లోకి చేర్చి అక్కడే ప్రతిష్ఠింపజేస్తుంది. గణపతి మధురుకు దర్శనమిచ్చి ఆమె సహాయంతోనే అక్కడ వెలసిన కారణంగా ఆమె పేరు మీద ఈ ఆలయం మద్దూరు ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

**బావినీళ్లు తగి మనసు మార్చుకున్న టిప్పు సుల్తాన్**
ఒకసారి టిప్పు సుల్తాన్ ఈ ఆలయాన్ని ధ్వంసం చేయాలని దండెత్తి వస్తాడు. ఆ సమయంలో టిప్పు సుల్తాన్‌కు దాహం వేసి ఆలయ ప్రాంగణంలోని బావి నీళ్లను తాగుతాడు. గణపతి మహాత్యంతో బావి నీళ్లను తాగిన తర్వాత టిప్పు సుల్తాన్ మనసు మార్చుకొని దాడిని విరమించుకొని స్వామిని భక్తితో కొలిచి అక్కడ నుంచి వెళ్లిపోయినట్టు స్థల పురాణం ద్వారా మనకు తెలుస్తోంది.


**అప్పాల ప్రీతి గణపతి**
ఈ ఆలయంలో మహాగణపతికి కేరళ సాంప్రదాయ వంటకమైన అప్పాన్నే నైవేద్యంగా పెడతారు.అదే భక్తులకు ప్రసాదంగా పంచి పెడతారు. గర్భాలయంలో గణపతికి ప్రతిరోజు ఉదయం సాయంత్రం సేవలను ఘనంగా నిర్వహిస్తారు.

**సహస్ర అప్ప పూజ**
ఈ ఆలయంలో గణపతికి విశేషంగా జరిగే సహస్ర అప్ప పూజలో భాగంగా నెయ్యి అప్పాలతో ప్రతిరోజు పూజలు జరిపించడం విశేషం అలాగే మూడ అప్పం పేరుతో మరో పూజా కార్యక్రమం కూడా జరుగుతుంది. అందులో భాగంగా స్వామి వారికి ఏ అలంకారం లేకుండా విగ్రహాన్ని అప్పాలతో కప్పేసి పూజాదికాలు నిర్వహిస్తారు. అలాగే ఇక్కడ మాసంలో వచ్చే రెండు చవితి రోజుల్లోనూ, వినాయక చవితి రోజు విశేష పూజలు ఘనంగా నిర్వహిస్తారు

**ఇతర ఉపాలయాలు**
ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి వీరభద్రుడు పాటు గణపతి సోదరులైన అయ్యప్ప సుబ్రహ్మణ్యస్వామి కూడా కొలువుదీరి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో చెక్క మీద రామాయణ మహాభారత ఘట్టాలని తలపించే శిల్పాలు చెక్కి ఉండడం చూడవచ్చు.

**దర్శనఫలం**
మధురంతేశ్వర సిద్ధి వినాయకుని ఒకసారి దర్శించుకుంటే చేపట్టిన పనుల్లో విఘ్నాలు తొలగిపోతాయని విశ్వాసం. అలాగే వివాహం ఆలస్యం అవుతున్నా, ఇంటి నిర్మాణంలో జాప్యం జరుగుతున్నా మద్దూరు గణపతిని దర్శించుకుంటే విఘ్నాలు తొలగిపోతాయని నమ్మకం. మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని మనం కూడా దర్శించుకుందాం. విఘ్నాలను తొలగించుకుందాం.

# భావనారాయణుడి గుడి కథ తెలుసా?
## మీరెప్పుడైనా వెళ్లారా?



మనదేశంలో అబ్బుర పరిచే అనేక ఆలయాలు ఉన్నాయి.ఆ ఆలయాలతో ముడిపడి ఉన్న వాస్తవ కథనాలు ఔరా! అనిపిస్తాయి.ఇలాంటి ఆలయాలను దర్శించడం మన పూర్వజన్మ సుకృతంగా భావించవచ్చు.భక్తుని కోసం భగవంతుడు భూమిపైకి వచ్చిన ఉదంతాలు ఎన్నో పురాణాలలో ఉన్నాయి. భగవంతుడు భక్తుని కోసం సాక్ష్యం చెప్పడానికి వచ్చిన ఆలయం ఎక్కడుంది? ఆ ఆలయ విశేషాలేమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.

**పంచ భావనారాయణస్వామి క్షేత్రాలలో ఒకటి**
ఆంధ్రప్రదేశ్‌లో పంచ భావనారాయణ క్షేత్రాలు ఉన్నాయి. అవి వరుసగా పొన్నూరు, సర్పవరం, బాపట్ల,భావదేవరపల్లి,పట్టసం.వీటిలో పొన్నూరులో భావనారాయణ స్వామి ఆలయం ప్రఖ్యాతి చెందినది. 'పొన్నూరు'లో వెలసిన స్వామి 'సాక్షి' భావనారాయణ స్వామిగా పూజాభిషేకాలు అందుకుంటున్నాడు.

**భావనారాయణ స్వామి ఆలయం ఎక్కడుంది?**
ఆంధ్రప్రదేశ్?లోని గుంటూరు పట్టణానికి 28 కిలోమీటర్ల దూరంలో పొన్నూరు ఉంది. పొన్నూరు అనే పదం 'పొన్, ఊరు' అనే రెండు పదాల కలయిక వల్ల వచ్చింది. 'పొన్' అంటే బంగారం అని 'ఊరు' అంటే గ్రామం అని అర్థం.అందుకే ఈ గ్రామాన్ని బంగారు గ్రామం, స్వర్ణపురి పేర్లతో కూడా పిలుస్తారు. ఇక్కడ భావనారాయణ స్వామి, సాక్షి భావనారాయణ స్వామిగా మారడం వెనుక ఓ ఆసక్తి కరమైన కథనం ఉంది. అదేమిటో తెలుసుకుందాం.

**సంతానం కోసం కాశి దర్శించిన కేశవయ్య**
పూర్వం పొన్నూరులో కేశవశర్మ అనే వ్యక్తి ఉండేవాడు.అతనికి సంతానం లేదు.దీంతో సంతానం కోసం అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించేవాడు.ఈ యాత్రల్లో తన కుటుంబ సభ్యులతో పాటు మేనల్లుడైన గోవిందుడిని కూడా వెంట బెట్టుకొని వెళ్లేవాడు.ఈ క్రమంలోనే కేశవయ్య కాశీని సందర్శించి అక్కడ నారాయణుడి దేవాలయంలో తనకు సంతాన ప్రాప్తి కలిగించాలని వేడుకొన్నాడు.

**గోవిందుని కోరిక**
అదే సమయంలో అక్కడే ఉన్న కేశవశర్మ మేనల్లుడు గోవిందుడు ఈసారి నీకు ఆడపిల్ల ఖచ్చితంగా కలుగుతుంది. అలా జరిగితే తనకు ఇచ్చి వివాహం చేయాల్సిందిగా కోరాడు. ఇందుకు కేశవశర్మ సరేనన్నాడు. ఇలా కొంత కాలం గడిచింది. నారాయణుడి అనుగ్రహంతో కేశవశర్మ దంపతులకు పండంటి ఆడపిల్ల పుట్టింది. ఆమెకు అక్క లక్ష్మి అని పేరుపెట్టాడు. ఆమెకు యుక్త వయసు కూడా వచ్చింది.

**ఇచ్చిన మాట తప్పిన కేశవశర్మ**
గోవిందుడు పుట్టుకతో గూనివాడు. అందుచేత గూనివాడైన గోవిందుడికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేయడానికి కేశవయ్య నిరాకరించాడు. తనకి ఇచ్చి పెళ్లి చేస్తానని భావనారాయణ స్వామి సాక్షిగా మాట ఇచ్చిన విషయాన్ని గోవింద శర్మ గుర్తుచేస్తాడు. గోవింద శర్మకి పిల్లను ఇవ్వడం ఇష్టం లేని కేశవ శర్మ, తప్పించుకోవడం కోసం భావనారాయణ స్వామి నే సాక్ష్యంగా తీసుకురమ్మని అంటాడు.


**నారాయణుని సాక్ష్యం చెప్పమని వేడుకున్న గోవిందుడు**
దీంతో గోవిందుడు కాశీలోని నారాయణుడిని దేవాలయం వద్దకు వెళ్లి స్వామి ముందు తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకొని బాధపడ్డాడు. "నీ సమక్షంలోనే కేశవయ్య తనకు కూతురును ఇచ్చి వివాహం చేస్తానని చెప్పాడు కదా? ఇప్పుడు నీవే వచ్చి ఈ విషయం చెప్పి తనకు తన మామ కూతురుతో పెళ్లి అయ్యేలా చూడాలి" అని ప్రార్థించాడు.

**సాక్ష్యమిచ్చిన భావనారాయణుడు**
తన భక్తునికి న్యాయం జరిపించడానికి నారాయణుడు అతనితో పాటు పొన్నూరు వచ్చి తన ఆలయంలో జరిగిన విషయం మొత్తం అక్కడి వారికి తెలిపి గోవిందుడి వివాహం జరిపించాడని పురాణ కథనం.ఆనాటి నుంచి ఇక్కడే నారాయణుడు సాక్షి భావనారాయణుడిగా కొలువై ఉండిపోతాడు. అందువల్లనే ఇక్కడి భావనారాయణుడిని 'సాక్షి' భావనారాయణుడిగా భక్తులు పిలుచుకుంటూ ఉంటారు. కొలుచుకుంటూ వుంటారు.

**దర్శనఫలం**
పొన్నూరు భావనారాయణ స్వామిని దర్శించుకోడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.వివాహ సంబంధ విషయాల్లో ఇబ్బందులు పడేవారు ఈ స్వామివారిని సందర్శించుకొంటే ఆ సమస్యలు తీరుతాయని భక్తులు నమ్మకం.

**ఇతర ఉపాలయాలు - పూజోత్సవాలు**
నిత్యం భక్తులతో కళకళలాడుతుండే ఈ ఆలయ ప్రాంగణంలో విశాలాక్షీ సమేత విశ్వేశ్వరుడు, చెన్నకేశవ స్వామి, లక్ష్మీ నరసింహుడు, వినాయకుడు, దాసాంజనేయ స్వామి ఆలయాలు కూడా దర్శించుకోవచ్చు.రోజూ స్వామికి త్రికాల సంధ్య పూజలు జరుగుతాయి.ఆదివారాలలో విశేషమైన అభిషేకాలు జరుగుతాయి.ప్రతి ఏడాది వైశాఖ మాసంలో స్వామివారికి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. నంకూడా పొన్నూరు భావనారాయణ స్వామిని దర్శించుకుందాం. నమో నారాయణాయ!

# మహాశివుడి కైలాసం అసలు పేరేంటి? - ఆ పేరెలా వచ్చింది?



మహాశివుడి కైలాసం గురించి అందరికీ తెలుసు పార్వతీ పరమేశ్వరుల నిలయం కైలాస పర్వతమే అని పురాణాలు చెబుతున్నాయి. శివయ్య చరిత్ర గురించి తెలిసిన వారికీ, విఘ్నేశ్వరుని చరిత్ర తెలిసిన వారికి కైలాసం గురించి తెలుసు.గజాననుడి ఉదరం నుంచి బటకు వచ్చిన పరమేశ్వరుడు కైలాసం వచ్చినప్పుడు, బాల గణపతి కైలాసానికి కాపలా ఉండడం అందరికీ తెలిసిందే.ఇంకా, చాలా పురాణాల్లో కూడా ఈ కైలాసం ప్రసక్తి ఉంది. వరాహాది పురాణాలతోపాటు పలు కావ్యాల్లో కూడా ఈ కైలాస పర్వత ప్రస్తావన అగుపిస్తుంది. వాల్మీకి రాసిన రామాయణంలోని కిష్కింధకాండలో కూడా ఉంది. సీత జాడ కోసం చేపట్టిన అన్వేషణలో భాగంగా సుగ్రీవుడు తన వానరసేనను నలు దిక్కులా పంపిస్తాడు.ఈ క్రమంలో ఉత్తరదిశగా వెళ్లాల్సిన సేనకు ఆ ప్రాంతం గురించి వివరిస్తున్న సందర్భంలో కైలాస పర్వతం గురించి కూడా ప్రస్తావించాడు.ఇంకా, మహా భారతంలో పాండవులు చేపట్టిన గంధమాదన యాత్ర సమయంలో,ఇంకా పలు సందర్భాల్లో కైలాసం గురించిన ప్రస్తావన ఉంది. మహాభారతంలో కైలాస పర్వతాన్ని "హేమకూటం"అనిసంబోధించారు. మరికొన్ని పురాణాల్లో "గణ పర్వతం",ఇంకొన్ని పురాణాల్లో "రత్నాద్రి" అనే పేరుతోనూ ప్రస్తుతించారు. మహాకవి కాళిదాసు రాసిన ప్రసిద్ధ కావ్యం "మేఘదూతం"లో కైలాస పర్వతం ఖ్యాతిని వివరించాడు. కైలాస పర్వతం వద్ద రాక్షసులు ఘోర తపస్సు చేశారని పురుణాలు చెబుతున్నాయి. త్రేతాయుగంలో రావణాసురుడు,భస్మాసురుడు, కృతయుగంలో మాంధాత వంటి అసురులు పరమేశ్వరు డిని ప్రసన్నం చేసుకునేందుకు కైలాస పర్వత ప్రాంతంలో తపస్సు చేశారట .ద్వాపర యుగంలో మహామహులు కైలాస పర్వతాన్ని సందర్శిం చారట.శ్రీకృష్ణుడితోపాటు అర్జునుడు, వ్యాసమ హర్షి, భీముడు కైలాసం వెళ్లారట.మరి, ఇంతకీ కైలాసానికి ఆ పేరు ఎలా వచ్చింది?

అంటే, వరాహ పురాణంతోపాటు పలు పురాణాలు చాలా చక్కగా వివరించాయి. భూమిపైనా, నీటిలోనూ స్థితమైన దాన్ని "కేలాస" అంటారు. ఈ కేలాస అనే పదానికి "స్ఫటిక" అనే అర్థం కూడా ఉంది. అంటే హిమాలయ పర్వతాల పైన మంచు స్ఫటిక రూపంలో ఉంటుంది కాబట్టి, ఆ ప్రాంతానికి "కేలాస" అన్నారు. కాల క్రమంలో అది "కైలాసం" అనే పేరు స్థిరపడిందని పండితులు ప్రహ్లాద్ వివరించారు.

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
సోమవారం,
అక్టోబర్ 27, 2025

# అర్ధశతకంతో మెరిసిన జోన్స్..
# చివరి మ్యాచ్‌లోనూ చేతులెత్తేసిన న్యూజిలాండ్




మహిళల ప్రపంచ కప్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టిన న్యూజిలాండ్ భారీ ఓటమితో టోర్నీని ముగించింది. సెమీస్ బెర్తును నిర్ణయించే కీలక పోరులో టీమిండియా చేతిలో కంగుతిన్న వైట్‌ఫెర్న్స్.. చివరి లీగ్ మ్యాచ్‌లోనూ తడబడింది. ఇంగ్లండ్ స్పిన్నర్లు అమీ జోన్స్(3-30), నాట్ సీవర్ బ్రంట్(2-31) విజృంభణతో 168కే ఆలౌటయ్యింది. స్వల్ప ఛేదనలో అమీ జోన్స్(86 నాటౌట్) అర్ధ శతకంతో మెరవగా.. టమ్మీ బ్యూమంట్(40) దంచేసింది. వీరిద్దరిచ్చిన శుభారంభాన్ని హీథర్ నైట్(33) కొనసాగించగా.. 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ అదరగొట్టింది. ఆస్ట్రేలియాపై ఊహించని ఓటమి నుంచి తేరుకున్న ఆ జట్టు ఆదివారం విశాఖపట్టణంలో న్యూజిలాండ్ భరతం పట్టింది. అసలే.. భారత జట్టు చేతిలో దారుణ ఓటమితో సెమీస్ అవకాశం చేజార్చుకున్న సోఫీ డెవినే బృందాన్ని మరింత కుంగదీస్తూ సూపర్ విక్టరీ కొట్టింది. తొలుత ఓపెనర్ సుజీ బేట్స్(10) వికెట్ తీసిన లిన్సే స్మిత్ (3-30 ) కివీస్‌ను ఆదిలోనే దెబ్బకొట్టింది. జార్జియా ప్లిమ్మర్(43), అమేలియా కేర్ (35) రెండో వికెట్‌కు కీలకమైన రన్స్ జోడించి జట్టును ఆదుకున్నారు.కానీ, చార్లీ డీన్, నాట్ సీవర్ బ్రంట్(2-31), అలిసే క్యాప్సే(2-34)లు వికెట్ల వేట కొనసాగించగా వైట్ ఫెర్న్స్ మిడిలార్డర్ కుప్పకూలింది. 38.2 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటయ్యింది. స్వల్ప లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు టమ్మీ బ్యూమంట్(40), అమీ జోన్స్(86 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. బౌండరీలతో చెలరేగిన ఈ ద్వయం.. న్యూజిలాండ్ బౌలర్లను వణికిస్తూ తొలి వికెట్‌కు 75 రన్స్ రాబట్టింది. ఈ జోడీని తహుహు విడదీసినా హీథర్ నైట్(33) అండగా.. జోన్స్ రెచ్చిపోయింది. వరుసగా రెండో అర్ధ శతకం నమోదు చేసిన తను జట్టుకు 8 వికెట్ల విజయాన్ని కట్టబెట్టింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

# టాస్ గెలిచిన టీమిండియా.. వర్షం ఎప్పుడు తగ్గిపోయేనో




మహిళల వన్డే వరల్డ్ కప్‌లో సెమీస్ బెర్తు దక్కించుకున్న భారత జట్టు చివరి లీగ్ మ్యాచ్‌కు వర్షం అడ్డుపడింది. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ఆదివారం మధ్నాహ్నం బంగ్లాదేశ్‌తో జరుగుతున్న పోరులో టాస్ పడగానే వాన అందుకుంది. కాసేపు దంచేసిన వరుణుడు కాసింత శాంతించినా.. చినుకులు మాత్రం పూర్తిగా తగ్గలేదు. దాంతో.. పిచ్‌తో పాటు ఔట్‌ఫీల్డ్ మొత్తాన్ని ప్లాస్టిక్ కవర్లలో కప్పేశారు. పరిస్థితి చూస్తుంటే.. భారత జట్టు ఇన్నింగ్స్ ఆలస్యం కావడమే కాదు ఓవర్ల కోటాపై కూడా కోత పడే అవకాశముంది. చివరి లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలుపొందిన హర్మన్‌ప్రీత్ బౌలింగ్ ఎంచుకుంది. కాసేపట్లో బంగ్లా ఇన్నింగ్స్ ఆరంభం కానుంది అనుకున్న ఫ్యాన్స్‌కు చిరాకు తెప్పిస్తూ వర్షం మొదలైంది. వాన ఎప్పుడు తగ్గుతుందబ్బా? అని ఇరుజట్ల క్రికెటర్లతో పాటు స్టేడియంలోని అభిమానులు ఆకాశంకేసి చూస్తున్నారు. బంగ్లాదేశ్‌పై వన్డేల్లో మెరుగైన రికార్డే ఉంది టీమిండియాకు. ఇప్పటివరకూ 8 మ్యాచుల్లో ఆరింట భారత్ గెలుపొందగా.. ఒకటి టైగా ముగిసింది. 2023 ద్వైపాక్షిక సిరీస్‌లో ఒకేఒక మ్యాచ్‌లో బంగ్లా విజయం సాధించింది. బ్యాటింగ్‌లో దారుణంగా విఫలమవుతున్న ఆ జట్టును ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, బౌలింగ్‌లో మరుఫా అక్తర్, షోర్నా అక్తర్ గొప్పగా రాణిస్తున్నారు. వీరిద్దరి నుంచి ముప్పు ఎదురయ్యే అవకాశాల్ని కొట్టిపారేయలేం. ఈ మ్యాచ్‌తో ఉమా ఛెత్రీ వన్డేల్లో అరంగేట్రం చేయనుంది. టాస్‌కు ముందు తను వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నుంచి తను డెబ్యూట్ క్యాప్ అందుకుంది.

# ఛేజింగ్ అంటే రెచ్చిపోతా..
# 2013 నుంచి మా జోడీ హిట్ కొడుతూనే ఉంది



రన్ మెషీన్, రికార్డ్ బ్రేకర్.. ఇలా ఎన్నో ఉపమానాలున్న విరాట్ కోహ్లీ కెరీర్‌లో క్లిష్టమైన పరిస్థితిని ఘనంగా అధిగమించాడు. సిడ్నీలో అర్ధ శతకంతో విరుచుకుపడి ఆస్ట్రేలియా పర్యటనను ముగించాడు. వరుసగా రెండు డకౌట్స్ తర్వాత.. అభిమానులను అలరించే ఇన్నింగ్స్ ఆడాడు విరాట్. సుదీర్ఘ సమయం క్రీజులో నిలిచిన కోహ్లీ.. సహచరుడు రోహిత్ శర్మతో కలిసి.. అజేయంగా జట్టును గెలిపించాడు. 74 పరుగులతో రాణించిన కింగ్ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ ఛేజింగ్ తనలోని అత్యుత్తమ ఆటను బయటకు తీసుకొస్తుందని అన్నాడు. సీడ్నీలో ఏమంత గొప్ప రికార్డు లేని విరాట్.. ఈసారి అర్ధ శతకంతో చెలరేగాడు. గతంలో ఈ వేదికపై ఏడు మ్యాచుల్లో ఒకేఒక ఫిఫ్టీతో సరిపెట్టుకున్న అతడు.. ఫామ్ అందుకుంటూ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. మ్యాచ్ పూర్తయ్యాక కామెంటేటర్లు రవిశాస్త్రి, ఆడం గిల్‌క్రిస్ట్‌లతో మాట్లాడిన కోహ్లీ.. తన ప్రదర్శన గురించి.. రోహిత్‌తో భాగస్వామ్య బంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'సుదీర్ఘ కాలంగా అంతర్జాతీయ క్రికెట్ ఆడినా సరే.. ప్రతి మ్యాచ్ మనకు కొత్త సవాళ్లు విసురుతుంది. రెండు డకౌట్స్ కూడా అంతే. కానీ, నేను ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. మరికొన్ని రోజుల్లో నాకు 37 ఏళ్ల వస్తాయి. అయితే.. ఛేదనకు దిగానంటే నాలోని అత్యుత్తమ ఆట ఆడుతాను. రోహిత్‌తో కలిసి జట్టును గెలిపించే భాగస్వామ్యం నెలకొల్పినందుకు చాలా సంతోషంగా ఉంది' అని కోహ్లీ వెల్లడించాడు. హిట్‌మ్యాన్‌తో భాగస్వామ్యం నెలకొల్పడం గురించి మాట్లాడుతూ.. 'మొదటి నుంచి మేము పరిస్థితిని అర్థం చేసుకున్నాం. ప్రతిసారి మేము చేసేది అదే. ప్రస్తుతం క్రికెట్‌లో అత్యంత అనుభవం కలిగిన జోడీ మాది. పెద్ద భాగస్వామ్యాలతో జట్టును గెలిపించగలమని మాకు తెలుసు. 2013లో ఆస్ట్రేలియాపైనే మా ద్వయం హిట్టైంది. ఈ దేశానికి రావడం చాలా నచ్చుతుంది. ఇక్కడ చాలా మంచి క్రికెట్ ఆడాం. భారీ సంఖ్యలో విచ్చేసి మమ్మల్ని ప్రోత్సహించినందుకు అభిమానులకు ధన్యవా దాలు' అని తన అనుబంధాన్ని పంచుకున్నాడు. ఆసీస్ నిర్దేశించిన 237 పరుగుల ఛేదనలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కోహ్లీ.. రోహిత్ జతగా స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఇద్దరూ చక్కని సమన్వయంతో ఆడుతూ.. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ కంగారూలను విసిగించారు. క్రీజులో చురుకుగా కదిలిన రోకో.. మునపటిలా ఆడిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. ఫామ్ అందుకున్న రన్ మెషీన్ కూపర్ క్రాన్లీ ఓవర్లో సింగిల్ తీసి వన్డేల్లో 75వ అర్ధ శతకం సాధించాడు. 52 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద.. కుమార సంగక్కర పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును బద్దలు కొట్టాడీ స్టార్ క్రికెటర్. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 14, 235 రన్స్ ఉండగా.. కొనసాగుతున్నాడు.

# టాస్ గెలిచిన భారత్.. మ్యాచ్ 43 ఓవర్లకు కుదింపు



మహిళల వన్డే ప్రపంచకప్ 2025 భాగంగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. వరుసగా 8 వన్డేల తర్వాత టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ టాస్ గెలిచింది. వర్షం అంతరాయం కలిగించడంతో భారత్-బంగ్లాదేశ్ మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. పవర్ ప్లే 9 ఓవర్లు ఉండనుంది. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఇప్పటికే సెమీ ఫైనల్‌కు అర్హత సాధించిన టీమిండియా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు టాస్ వేయాల్సి ఉంది. వర్షం కారణంగా 35 నిమిషాలు ఆలస్యమైంది. 3.25 గంటలకు మ్యాచ్ మొదలు కావాల్సి ఉండగా ఇంతలోనే మళ్లీ వర్షం మొదలైంది. దీంతో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో వికెట్ కీపర్ ఉమా ఛెత్రి భారత్ తరఫున అరంగేట్రం చేస్తోంది. ఆమె స్మృతి మంధాన చేతుల మీదుగా క్యాప్ అందుకుంది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో గాయపడిన కీపర్ రిచా ఘోష్‌కు విశ్రాంతి ఇవ్వడంతో 23 ఏళ్ల ఉమాకు అరంగేట్రం చేసే అవకాశం వచ్చింది. మరోవైపు క్రాంతి గౌడ్, స్నేహ్ రాణాకు కూడా రెస్ట్ ఇచ్చారు. వారి స్థానాల్లో రాధా యాదవ్, అమన్ జ్యోత్ కౌర్ తుది జట్టులోకి వచ్చారు. భారత్ తుది జట్టు: ప్రతీక రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, ఉమా ఛెత్రి (వికెట్‌కీపర్), అమన్‌జ్యోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా సింగ్ బంగ్లాదేశ్ తుది జట్టు: సుమైనా అక్తర్, రుబ్యా హైదర్ జెలిక్, షర్మిన్ అక్తర్, శోభనా మోస్త్రరీ, నిగర్ సుల్తానా (కెప్టెన్, వికెట్‌కీపర్), షోర్నా అక్తర్, రీతు మోని, రబెయా ఖాన్, నహిదా అక్తర్, నిషితా అక్తర్ నిషి, మారుఫా అక్తర్.

## వర్షం కారణంగా గంటన్నర ఆలస్యం.. 43 ఓవర్ల మ్యాచ్ ఆడనున్న బంగ్లా, టీమిండియా




మహిళల వన్డే వరల్డ్ కప్‌లో వర్షం అంతరాయాలతో విసిగిపోతున్న అభిమానులకు గుడ్‌న్యూస్. డీవై పాటిల్ స్టేడియంలో భారత జట్టు చివరి లీగ్ మ్యాచ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. సాయంత్రం 5 గంటలకు తొలి బంతి పడనుంది. అయితే.. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఓవర్ల కోత విధించారు అంపైర్లు. 43 ఓవర్ల మ్యాచ్ నిర్వహించనున్నారు. కాబట్టి.. పవర్ ప్లే 9 ఓవర్లకే ముగియనుంది. ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ ఫైట్‌కు ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌గా బంగ్లాదేశ్‌తో తలపడుతోంది టీమిండియా. ఇరుజట్ల మధ్య డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతున్న చివరి లీగ్ దశ పోరు టాస్ పడగానే అందుకున్న వాన దాదాపు గంటన్నర తర్వాత శాంతించింది. దాంతో.. ఊపిరిపీల్చుకున్న సిబ్బంది సూపర్ సాపర్స్ సాయంతో ఔట్‌ఫీల్డ్‌ను సిద్దం చేస్తున్నారు. గంటన్నర సమయం వృథా అయినందున ఓవర్లను తగ్గించి ఆడిస్తున్నారు అంపైర్లు. ఇరుజట్ల కెప్టెన్లతో మాట్లాడి.. 43 ఓవర్ల మ్యాచ్ సాధ్యపడుతుందని చెప్పారు.

## విమర్శించడమే కాదు.. ప్రశంసించడమూ వచ్చు: మాజీ క్రికెటర్ శ్రీకాంత్



టీమిండియా స్టార్ బౌలర్ హర్షిత్ రాణా జట్టులో చోటు ఇవ్వడంపై మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. 'గంభీర్ మనిషి' అంటూ తీవ్ర పదజాలం వాడాడు. తొలి రెండు వన్డేల్లో రాణా ప్రదర్శనపై విమర్శలు చేస్తూనే వస్తున్నాడు. అయితే మూడో వన్డేలో హర్షిత్ అద్భుతమైన స్పెల్‌తో ఆసీస్‌ను ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వికెట్లు తీసి సత్తా చాటాడు. దీంతో శ్రీకాంత్ కూడా ఈ సారి విమర్శడం మానేసి రాణాపై ప్రశంసల వర్షం కురింపించాడు.'తొలి రెండు వన్డేల్లో నిరాశపర్చినా.. మూడో వన్డేలో హర్షిత్ అదరగొట్టాడు. నాకు విమర్శించడమే కాదు.. ప్రశంసించడం కూడా తెలుసు. నా ప్రశంసలకు అతడు పూర్తి అర్హుడు. అతడి ఆటపట్ల చాలా సంతోషంగా ఉన్నా. అతడి ఎంపికపై నేను చాలా విమర్శలు చేశా. వాటన్నింటికీ రాణా తన బంతితో ముగింపు ఇచ్చాడు. రాణా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. గత మ్యాచ్‌లో టెయిలెండర్‌గా వచ్చి పరుగులు చేశాడు. ఇప్పుడు తొలి స్పెల్ నుంచే నాణ్యమైన బౌలింగ్ చేశాడు. అతడి ఆత్మవిశ్వాసం రోజు రోజుకూ పెరిగిపోతుంది.

మూడో వన్డేలో చాలా కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. అంతే దూకుడుగా నాలుగు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇందులో ఓవెన్‌ను ఔట్ చేసిన తీరు నాకెంతో నచ్చింది. ఇదే నా ఫేవరెట్ వికెట్. రాణా అద్భుతమైన బౌల్ చేశాడు.. అంతే అద్భుతంగా రోహిత్ శర్మ కూడా క్యాచ్ పట్టాడు. లైన్ అండ్ లెంగ్త్‌తో చక్కటి బౌలింగ్ వేశాడు. మరీ ఎక్కువగా షార్ట్ బంతులు వేయలేదు. అలాగే స్లో బౌలింగ్ చేయలేదని శ్రీకాంత్ వెల్లడించాడు.

## అర్జున్ అదరహో రంజీ ట్రోఫీ 2025



రంజీ ట్రోఫీ 2025 సీజన్‌లో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొడుకు, గోవా స్టార్ ఆల్‌రౌండర్ అర్జున్ టెండూల్కర్ అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చాడు. చండీగర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఏకంగా వంద పరుగులు సమర్పించు( కున్నఅర్జున్.. శిమొగా వేదికగా కర్ణాటకతో జరుగుతున్న మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటాడు. అర్జున్ తన బౌలింగ్‌లో కర్ణాటక టాప్ ఆర్డర్ ఒక్కసారిగా కుప్పకూలింది. గోవా తరఫున బౌలింగ్ ఎటాక్‌ను ప్రారంభించిన ఈ స్పీడ్‌స్టర్.. కర్ణాటక ఓపెనర్ నికిన్ జోస్‌ను మూడు పరుగులకే పెవిలియన్ పంపించాడు. ఆ తర్వాత వెంటనే వికెట్ కీపర్ బ్యాటర్ కృష్ణన్ శ్రీజిత్‌ను డకౌట్ చేశాడు.

అంతేకాకుండా క్రీజులో సెట్ అయిన అభినవ్ మనోహర్‌ను కూడా అర్జున్ బోల్తా కొట్టించాడు. తొలి రోజు ఆటలో12.2 ఓవర్లు బౌలింగ్ చేసిన అర్జున్ టెండూల్కర్.. మూడు వికెట్లు పడగొట్టి కేవలం 33 పరుగులే ఇచ్చాడు. అర్జున్ సూపర్ స్పెల్‌తో పాటు మరో ఫాస్ట్ బౌలర్ వాసుకి కౌశిక్ రెండు కీలక వికెట్లు తీసి గోవా జట్టును టాప్‌లో ఉంచారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక 5 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. కాగా అర్జున్ టెండూల్కర్ 2021-2022 సీజన్ తర్వాత ముంబై నుంచి గోవాకు మారిన సంగతి తెలిసిందే.

## బంగారం కొనాలనుకునే వారికి అలర్ట్.. పసిడి ధరల్లో మళ్లీ పెరుగుదుల



గత రెండు మూడు రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు నేడు మళ్లీ స్వల్పంగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉయదం 6.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా పెరిగి రూ.1,25,560కు చేరుకుంది. 22 క్యారెట్ బంగారం ధర రూ.1,15,150కు పెరిగింది. కిలో వెండి ధర రూ.1,70,000 వద్ద ఉంది . హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,25,650గా ఉంది. ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,15,150కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌ల్లో ఔన్స్ బంగారం ధర 4,113 డాలర్లుగా ఉంది. ఔన్స్ వెండి ధర 54 డాలర్ల వద్ద తచ్చాడుతోంది. ఇప్పటివరకూ ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు ప్రస్తుతం స్థిరీకరణ దిశగా వెళుతున్నట్టు మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అమెరికా చైనా మధ్య వాణిజ్య బంధం మెరుగయ్యే అవకాశం ఉండటంతో బంగారానికి డిమాండ్ తగ్గి అమెరికా స్టాక్స్, ప్రభుత్వ బాండ్స్‌లోకి పెట్టుబడులు మళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ బంగారం రేటు దాదాపు 57 శాతం మేర పెరిగి ఇన్వెస్టర్లకు కనక వర్షం కురిపించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా కేంద్ర బ్యాంకులు భారీగా బంగారం కొనుగోళ్లకు దిగడం, ఈటీఎఫ్‌లల్లోకి నిధుల వెల్లువ వంటివన్నీ బంగారం ధర పెరుగదలకు కారణమయ్యాయి.


# గ్లామర్ ట్రీట్‌తో అదరగొట్టిన రోజా కూతురు

తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలిగి, ఆ తర్వాత రాజకీయాల్లో ఎమ్మెల్యేగా, మంత్రిగా సత్తా చాటిన రోజా సెల్వమణి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే, ఇప్పుడు చర్చ అంతా రోజా వారసురాలు, ప్రతిభావంతురాలు అన్షు రెడ్డి గురించే. చిన్ననాటి నుంచే రచయిత్రిగా గోల్డ్ మెడల్స్ సాధించిన అన్షు, ఇటీవల తన గ్లామరస్ లుక్‌తో సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆమె అచ్చం తల్లి రోజాకు జిరాక్స్ కాపీలా కనిపించడమే దీనికి ప్రధాన కారణం. ఇటీవల ఒక ఈవెంట్‌లో హీరోయిన్లను తలపించేలా ర్యాంప్ వాక్ చేసిన అన్షు రెడ్డి, ఆ తర్వాత తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ట్రెండీ ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. స్లీవ్‌లెస్ షర్ట్, బుడ్డి నిక్కరు వంటి ట్రెండీ దుస్తుల్లో క్లీవేజ్ షోతో అన్షు వదిలిన ఫొటోలు ఫ్యాన్స్‌కు గట్టి షాకే ఇచ్చాయి. ఆమెను చూసిన అభిమానులు, ఇది వింటేజ్ రోజా లుక్.. రోజా ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో ఇలానే ఉండేవారని అభిప్రాయపడుతున్నారు. అన్షు అందంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ..ఇంత అందంగా ఉందేంటి బాబోయ్, రోజా కూడా ఈమె అందం ముందు సరితూగదంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.



అన్షు రెడ్డికి హీరోయిన్ మెటీరియల్ అనడంలో ఎలాంటి సందేహం లేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె అందం, స్క్రీన్ ప్రెజెన్స్ కొత్తగా ఎంట్రీ ఇస్తున్న హీరోయిన్ల కంటే మరింత ఆకర్షణీయంగా ఉన్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. నటన, డ్యాన్స్ ప్రతిభ కనుక తోడైతే, ఆమెను ఇండస్ట్రీలో ఆపడం కష్టమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అన్షు ఫొటోలు సోషల్ మీడియాను ఊపేస్తుండగా, ఆమె సినీ రంగ ప్రవేశం ఎప్పుడు, ఏ సినిమాతో జరుగుతుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ గ్లామరస్ ట్రీట్‌తో, ఇండస్ట్రీలో అన్షు ఎంట్రీ పక్కా అని ఫ్యాన్స్ గట్టిగా కామెంట్స్ చేస్తున్నారు.

# సమంత డబుల్ రోల్ .. 'మా ఇంటి బంగారం'తో తిరిగి బరిలోకి



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు చాలా రోజుల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు వచ్చింది. హెల్త్ ఇష్యూస్ కారణంగా లాంగ్ బ్రేక్ తీసుకున్న సామ్, ఇప్పుడు ఫుల్ ఎనర్జీతో రీ-ఎంట్రీకి రెడీ అయ్యారు. అభిమానులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న ఆమె సోలో పర్ఫార్మెన్స్ ఇప్పుడు పెద్ద తెరపై కనిపించబోతోంది. 'ఖుషి' (2023) తర్వాత సమంతని మళ్లీ ఒక పవర్‌ఫుల్ లీడ్ రోల్‌లోచూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈసారి ఆమె కేవలం హీరోయిన్‌గానే కాకుండా ప్రొడ్యూసర్‌గా కూడా బరిలోకి దిగుతున్నారు. సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ ప్రాజెక్ట్‌ను ఆమె చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకున్నారు. సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం, ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేగంగా కొనసాగుతోంది. సమంతతో పాటు మిగిలిన స్టార్ కాస్ట్‌పై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నది 'ఓ బేబీ' ఫేమ్ నందిని రెడ్డి.

# 2026లో చిరు ఫ్యాన్స్‌కి సూపర్బ్ ట్రీట్.. ఇక సందడే సందడి



మెగాస్టార్ చిరంజీవి పదేళ్ల గ్యాప్ తర్వాత రీ ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు. ఆయన రీ ఎంట్రీ చిత్రం ఖైదీ నంబర్ 150 సూపర్ హిట్ కావడంతో సినీ పరిశ్రమలో చిరు మళ్లీ తన ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన ఆచార్య చిత్రానికి మంచి స్పందన రాకపోవడం, గాడ్ ఫాదర్ సినిమా అంచనాలు అందుకోకపోవడం ఫ్యాన్స్‌ని నిరాశపరిచింది. ఆ తరువాత వచ్చిన వాల్తేరు వీరయ్య సినిమా హిట్ అయినప్పటికీ, భోళా శంకర్ నిరాశపరిచింది. ఈ సినిమా తర్వాత దాదాపు ఏడాది పాటు చిరంజీవిని వెండి తెరపై చూడడం సాధ్యం కాలేదు. కొన్నాళ్లుగా విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నారు చిరు. ఈ సినిమా 2026 సమ్మర్‌కు రానుంది.. గ్రాఫిక్స్, కొన్ని రీ-షూట్‌లు కారణంగా రిలీజ్ ఆలస్యం అయింది. ఏదేమైన సమ్మర్‌లో రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విశ్వంభర షూటింగ్ పూర్తి కాగా, చిన్న ప్యాచ్ వర్క్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా మల్లిడి వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతోంది. మరోవైపు అనీల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వర ప్రసాద్ చిత్రం చేస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. చిరు బాబి కాంబినేషన్లో కొత్త చిత్రం 2026 దసరా లేదా దీపావళికి రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. మరొక ఆసక్తికర విషయం ఏమిటంటే, చిరు.. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమా చేయనుండగా, ఈ సినిమాని 2026లో సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు.

# అతన్నే పెళ్లి చేసుకుంటా.. కాబోయే వాడి గురించి శ్రీలీల ఓపెన్




టాలీవుడ్ లోకి "పెళ్లి సంద" సినిమాతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది " శ్రీలీల ". తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. తన గ్లామర్, ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్, డాన్స్ స్కిల్స్‌తో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆ మూవీ ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో మెప్పించకపోయినా.. నటిగా మాత్రం ఈ అమ్మడుకు బాగా కలిసొచ్చింది.
బ్లాక్‌బస్టర్ హిట్‌తో వరుస ఆఫర్స్..ఆ తర్వాత రవితేజ హీరోగా వచ్చిన "ధమాకా" సినిమాతో శ్రీలీలకు బ్లాక్‌బస్టర్ హిట్ లభించింది. ఈ విజయంతో ఆమెకు మాస్ ప్రేక్షకులలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు వచ్చాయి. అయితే వరుసగా పలు చిత్రాల్లో నటించినా అవి ఫ్లాప్ కావడంతో రేసులో కొంచెం వెనుక పడింది. కానీ "పుష్ప-2"లో ఐటెం సాంగ్ ద్వారా పాన్ ఇండియా క్రేజ్ సంపాదించింది. ఈ పాట ఆమెకు పెద్ద గుర్తింపు తీసుకొచ్చింది. శ్రీలీల ప్రస్తుతం తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఒకేసారి సినిమాలు చేస్తోంది. తెలుగులో రవితేజతో "మాస్ జాతర", పవన్ కళ్యాణ్‌తో "ఉస్తాద్ భగత్ సింగ్" చిత్రాలలో నటిస్తోంది. అలాగే అఖిల్ సరసన "లెనిన్"లో కూడా చేస్తోంది. తమిళంలో శివ కార్తికేయన్ సరసన "పరాశక్తి" అనే మూవీలో యాక్ట్ చేస్తోంది. మరోవైపు హిందీలో కార్తీక్ ఆర్యన్ సరసన "ఆషికీ 3" లో ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీ ఇంకా సెట్స్ మీద ఉన్నలోపే దోస్తానా 2 చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు "ఆషికీ 3" షూటింగ్‌లో కార్తీక్ ఆర్యన్‌తో సన్నిహితంగా ఉన్న ఫోటోస్ ఆ మధ్య వైరల్ అయ్యాయి. దాంతో వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని సోషల్ మీడియాలో వార్త హల్‌చల్ అయ్యింది. అయితే ఇప్పటివరకు శ్రీలీల, కార్తీక్ ఇద్దరూ అధికారికంగా స్పందించలేదు. అయితే రీసెంట్ గా మాస్ జాతర మూవీ ప్రమోషన్స్ లో పాల్గొన్న ఈ భామ.. తన పెళ్లి గురించి ఓపెన్ అయ్యింది. దీంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. శ్రీలీల మాట్లాడుతూ.. తనకు కాబోయే భర్తలో మూడు లక్షణాలు ఉండాలని పేర్కొన్నారు. కొన్ని విషయాల్లో ఆమెను భరించగలవాడు, ఆ కష్టాన్ని ఇష్టంగా స్వీకరించగలవాడు. చక్కని హాస్య చతురతతో నవ్వించే వాడు. ఫ్యామిలీ-మ్యాన్లై ఉండే వాడు.. కావాలని తెలిపింది. అయితే ఈ మూడు లక్షణాలు ఉన్న వ్యక్తి దొరకనంత వరకు పెళ్లికి పెద్ద తొందర లేదని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది.

# నెపోలియన్ రిటర్న్స్.. ఆసక్తికరంగా గ్లింప్స్

నా నీడ పోయిందంటూ అప్పట్లో నెపోలియన్ చిత్రంతో ఆకట్టుకున్న డైరెక్టర్ ఆనంద్ రవి ఇప్పుడు మరో కొత్త కాన్సెప్ట్‌తో వచ్చాడు. గేదె దెయ్యం అంటూ మరో వైవిధ్యాన్ని తీసుకొచ్చాడు. దీనికి సంబంధించిన చిత్ర టైటిల్, గ్లింప్స్‌ను ఆదివారం విడుదల చేశారు. ప్రముఖ రైటర్ ఆనంద్ రవి స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాకు నెపోలియన్ రిటర్న్ అనే టైటటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో దివి మరో కీలక పాత్ర పోషించింది. ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై భోగేంద్ర గుప్త ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.' నెపోలియన్' రిటర్న్స్' టైటిల్ గ్లింప్స్ విషయానికి వస్తే.. ఆనంద్ రవి ఇద్దరు స్నేహితులతో కలిసి కంప్లయింట్ ఇవ్వడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్తాడు. అక్కడ ఓ గేదే ఆత్మగా మారి ఇబ్బంది పెడుతుందని ఇన్‌స్పెక్టర్ రఘుబాబుతో చెబుతాడు. ఆ తర్వాత ఆనంద్ రవి విజువల్స్‌తో పాటు తాను ఏం కంప్లయింట్ చేయాలనుకుంటున్నాడో దానికి సంబంధించిన విజువల్స్‌ను వేగంగా చూపించారు. దీంతో పోలీస్ రఘుబాబు సహా అందూ ఆ గేదె ఆత్మ గురించి మరింత సమాచారం తెలుసుకోవాలని అనుకుంటున్నారు. ఇంట్లో కనిపించే 9 నెలల చిన్నారి పుర్రెను చూపించడంతో సరికొత్త హారర్ సస్పెన్స్ మూవీ భావన కలుగుతుంది. గ్లింప్స్ చివరలో ఓ పోలీస్ ఆఫీసర్ ఆనంద్ రవిని చూస్తూ.. ఇంతకుముందు నువ్వే కదా నీడ పోయిందని కంప్లయింట్ ఇచ్చావని అడుగుతాడు. ఇలా నెపోలియన్ సినిమా రిఫరెన్స్‌ను అక్కడ చూపించారు. ఈ గ్లింప్స్‌లో విజువల్స్ చాలా రిచ్‌గా కనిపిస్తున్నాయి. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆనంద్ రవి, దివి వాద్యా, ఆటో రాంప్రసాద్, రఘుబాబు, సూర్య పింగ్ పాంగ్, శ్రవణ్ రాఘవేంద్ర, యాంకర్ రవి, రవి వర్మ, మీసాల లక్ష్మణ్ తదితరులు ఈ సినిమాలో నటించారు. భోగేంద్ర గుప్తా నిర్మిస్తోన్న ఈ సినిమాకు కార్తీక్ కొప్పెర సినిమాటోగ్రఫీ, సిద్ధార్థ్ సదాశివుని సంగీతాన్ని అందిస్తున్నారు.




## హాలీవుడ్ సింగర్ కేటీ పెర్రీతో డేటింగ్.. మరోసారి కెమెరాకి చిక్కిన కెనడా మాజీ ప్రధాని



హాలీవుడ్ పాప్ సింగర్ కేటీ పెర్రీ, కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడోతో డేటింగ్‌లో ఉన్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. గతవారం వీరిద్దరూ కాలిఫోర్నియా తీరంలో ఒక విలాసవంతమైన యాచ్ సన్నిహితంగా.. ముద్దులు పెట్టుకుంటూ ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే ఈ ఘటన మరువకముందే తాజాగా ఈ జంట మరోసారి కెమెరాకు చిక్కారు. శనివారం రాత్రి కేటీ పెర్రీ (41) తన పుట్టినరోజును జరుపుకునేందుకు జస్టిన్ ట్రూడో (53)తో కలిసి పారిస్‌లోని ప్రముఖ క్రేజీ హార్స్ పారిస్ క్యాబరే షోకు హాజరయ్యింది. ఈ షో ముగిసిన తర్వాత వేదిక నుంచి బయటకు వస్తున్న కేటీ పెర్రీ, ట్రూడో కలిసి నడుస్తూ కనిపించారు. ఈ సమయంలో వారిద్దరూ చేతులు పట్టుకుని ఆనందంగా నడిచారు. దీంతో వీరిద్దరూ నిజంగానే డేటింగ్‌లో ఉన్నారని హాలీవుడ్ మీడియా వెల్లడించింది. ఈ వేడుకలో కేటీ పెర్రీ బ్యాక్‌లెస్ ఉన్న ఎరుపు రంగు గౌనులో ఆకట్టుకోగా, ట్రూడో పూర్తిగా నలుపు రంగు దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించారు. జస్టిన్ ట్రూడో, కేటీ పెర్రీ మధ్య సంబంధం గురించి గత కొద్ది నెలలుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. 2025 జూలైలో ఈ ఇద్దరూ కెనడాలోని మాంట్రియల్‌లో జరిగిన ఓ ప్రైవేట్ డిన్నర్ డేట్‌లో కలుసుకున్నారు.

## ఎక్జయిటింగ్ అప్‌డేట్.. నిఖిల్ స్వయంభు టీం ఏం ప్లాన్ చేస్తుందేంటి



టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్దార్థ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్ స్వయంభు 20గా నిఖిల్ తొలి పాన్ ఇండియా చిత్రంగా వస్తోన్న ఈ చిత్రంలో మలయాళ భామ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ నుంచి అదిరిపోయే వార్త రాబోతుందని చెప్పింది నిఖిల్ టీం. ఉత్తేజాన్ని అందించే, జ్ఞానోదయాన్ని కలిగించే నిఖిల్ స్వయంభు ప్రయాణం.. మోస్ట్ ఎక్జయిటింగ్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే రాబోతుందంటూ మేకర్స్ తెలియజేశారు. ఇంతకీ ఆ ఆసక్తికర వార్త ఏంటని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు.
ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నట్టు ఇప్పటివరకు షేర్ చేసిన పోస్టర్లు చెబుతున్నాయి. కేజీఎఫ్ ఫేం రవిబస్రూర్ స్వయంభు చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# వివాదంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్.. ఉగ్రవాదిగా ప్రకటించిన పాకిస్తాన్

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద వివాదానికి కారణమయ్యాయి. పాకిస్తాన్ ప్రభుత్వం ఆయనను "ఉగ్రవాది" గా ప్రకటిస్తూ అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయం ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది. ఇటీవల సౌదీ అరేబియాలో జరిగిన 'జాయ్ ఫోరమ్ 2025' కార్యక్రమంలో సల్మాన్ ఖాన్ పాల్గొన్నారు. అక్కడ మాట్లాడుతూ.. సౌదీ అరేబియాలో హిందీ సినిమాలు సూపర్‌హిట్ అవుతున్నాయి. తమిళం, తెలుగు, మలయాళం సినిమాలు కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. ఇక్కడ పాకిస్తాన్ నుంచి, ఆఫ్ఘనిస్తాన్ నుంచి, బలూచిస్తాన్ నుంచి కూడా వచ్చిన వారు చాలా మంది ఉన్నారు అని అన్నారు. అయితే ఇక్కడే వివాదం మొదలైంది. సల్మాన్ "పాకిస్తాన్" , "బలూచిస్తాన్"ను వేర్వేరుగా ప్రస్తావించడంతో పాకిస్తాన్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. సల్మాన్ వ్యాఖ్యలను దేశ వ్యతిరేక చర్యగా పరిగణించిన షెహ్‌బాజ్ ప్రభుత్వం, ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఆయనను "ఉగ్రవాది"గా ప్రకటించింది. అంతేకాకుండా, సల్మాన్ పేరు నాల్గవ షెడ్యూల్‌లో చేర్చింది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు సల్మాన్ లేదా ఆయన బృందం ఎటువంటి స్పందన ఇవ్వలేదు. సల్మాన్ వ్యాఖ్యలు బలూచిస్తాన్ వేర్పాటువాద నేతల్లో మాత్రం ఆనందాన్ని కలిగించాయి. మీర్ యార్ బలూచ్, బలూచిస్తాన్ స్వతంత్రత కోసం పోరాడుతున్న నాయకుడు కాగా,
ఆయన మాట్లాడుతూ.. ప్రధాన దేశాలు మాట్లాడటానికి భయపడుతున్న సమయంలో సల్మాన్ ధైర్యంగా బలూచిస్తాన్ గురించి ప్రస్తావించాడు. 60 మిలియన్ల బలూచ్ ప్రజలు దీనితో సంతోషించారు" అని పేర్కొన్నారు. బలూచిస్తాన్ పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రావిన్స్. ఇది దేశ గ్యాస్ ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉంది. అయితే ఈ ప్రాంతానికి తగిన అభివృద్ధి జరగలేదని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా వేర్పాటువాద ఉద్యమాలు కొనసాగుతున్నాయి. అయితే సల్మాన్ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకమా లేదా అనుకోకుండా మాట్లాడినవా? అన్నది ఇప్పటికీ స్పష్టంగా తెలియలేదు. కానీ ఈ ఘటనతో ఆయన పేరు మరోసారి అంతర్జాతీయ రాజకీయ చర్చల్లో నిలిచింది.



Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com